12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 13 సంచిక : 26 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 1 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :26 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 1 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




- 93 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన విశాఖ పోర్టులో అసలేం జరుగుతోంది?
- దేశ ఆర్థిక వ్యవస్థకు వాణిజ్య ద్వారం... ఇప్పుడు పరిపాలనా వ్యవస్థపై ప్రశ్నలు
- కేంద్ర ప్రభుత్వ పరిధిలోని మేజర్ పోర్టా?.. కొందరు అధికారుల 'ప్రైవేట్ సామ్రాజ్యమా?'
- పైస్థాయి పెత్తనం కింద కిందిస్థాయి ఉద్యోగుల గొంతు నలిగిపోతోందా?
- కమర్షియల్ నిర్ణయాల్లో పారదర్శకత ఎంత?.. వ్యక్తిగత ప్రభావం ఎంత?
- బెర్త్ కేటాయింపు నుంచి కార్గో హ్యాండ్లింగ్ వరకు... నిర్ణయాల వెనుక అసలు వ్యవస్థ ఏమిటి?
- ఫైళ్లు తెరిస్తే కనిపించేది పారదర్శకతా?.. మరో కథా?

**'పెన్ పవర్' గ్రౌండ్ రిపోర్ట్ - - ఎపిసోడ్-1**

వివరాలు 2లో..

## రష్యా సైన్యంలో చేరొద్దు..
## అది చాలా ప్రమాదకరం!
### భారతీయులకు కేంద్రం తీవ్ర హెచ్చరిక



- డబ్బు ఆశతో ప్రమాదకర మార్గంలో వెళ్లొద్దని సూచన
- పౌరసత్వం వదులుకుని మరీ కొందరు సైన్యంలో చేరుతున్నారని ఆందోళన
- ఇప్పటివరకు 139 మందిని సురక్షితంగా వెనక్కి రప్పించినట్లు వెల్లడి
- మిగిలిన వారిని రప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని స్పష్టీకరణ

- మిగతా 2లో

# మహిళలకు ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

- విజయవాడలో 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమం
- 120 ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం చూపినట్లు తెలిపిన సీఎం
- రాష్ట్రవ్యాప్తంగా 26,401 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ



పెన్ పవర్ డెస్క్:తమ ప్రభుత్వం 120 ఏళ్ల నాటి ఇళ్ల స్థలాల పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయవాడలోని మకినేని బసవపున్నయ్య స్టేడియంలో నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సొంత ఇల్లు అనేది పేదల జీవితకాల స్వప్నమని, దీని కోసం 40 నుంచి 50 ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారు ఎందరో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 26,401 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. ఎన్టీఆర్

- మిగతా 2లో



## మోదీ-ట్రంప్ ఫోన్ కాల్..
## వాణిజ్యం, రక్షణ, ఇంధనంపై కీలక చర్చలు

- వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చ
- ప్రాంతీయ పరిణామాలపై అభిప్రాయాల మార్పిడి
- ప్రపంచ శాంతి, భద్రతపై చర్చ
- సన్నిహిత సంబంధాలు కొనసాగించేందుకు అంగీకారం

పెన్ పవర్ డెస్క్:ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా భారత్–అమెరికా ద్వైపాక్షిక సంబంధాల్లో కీలకమైన అంశాలపై చర్చించారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతల రంగాల్లో ఇరు దేశాల సహకారాన్ని సమీక్షించినట్లు మోదీ తెలిపారు. ట్రంప్‌తో జరిగిన చర్చలు ఫలప్రదంగా సాగాయని మోదీ 'ఎక్స్'లో వెల్లడించారు. భారత్–అమెరికా సమగ్ర గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సన్నిహితంగా కొనసాగాలని ఇరు దేశాల నేతలు అంగీకరించినట్లు తెలిపారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపైనా ఇద్దరూ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రపంచ శాంతి, భద్రతను ముందుకు తీసుకెళ్లేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై

- మిగతా 2లో



## విమానాన్ని కూల్చివేసేందుకు
## యత్నించాడు

పెన్ పవర్ డెస్క్: ఫ్లైదుబాయ్ విమానంలోని ఓ పైలట్.. తోటి పైలట్‌ను కత్తితో పొడిచి, విమానాన్ని కూల్చివేసేందుకు యత్నిం చాడని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆరోపించారు. ప్రయాణికులు, సిబ్బంది కలిసి అతడిని కట్టడి చేసి.. పెను ప్రమాదాన్ని నివారించారని తెలిపారు.

- మిగతా 2లో

## తిరుపతి నుంచి వారణాసికి 25 బైక్‌లు..
## టీడీపీ నేతల సేవా సంకల్ప యాత్ర!

- సేవా సంకల్ప యాత్రను ప్రారంభించిన పల్లా శ్రీనివాసరావు
- తిరుపతి నుంచి వారణాసి వరకు బైక్ యాత్ర
- యాత్రలో పాల్గొంటున్న 25 మంది రైడర్లు
- టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో యాత్ర నిర్వహణ
- నాలుగు రాష్ట్రాల మీదుగా ఎనిమిది రోజుల ప్రయాణం

- మిగతా 2లో

పెన్ పవర్ డెస్క్:ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి నుంచి వారణాసి వరకు చేపట్టిన 'సేవా సంకల్ప యాత్ర'ను



## 'బాబాయ్ హత్యతో అబ్బాయికే లాభం'..
## జగన్ మౌనంపై మంత్రి నిమ్మల ప్రశ్నలు



- వివేకా హత్యపై మంత్రి నిమ్మల తీవ్ర ఆరోపణలు
- కేసులో కీలక వ్యక్తుల మరణాలపై ప్రశ్నలు
- రూ.40 కోట్ల సుపారీ అంశాన్ని ప్రస్తావించిన మంత్రి
- ఈడీ అటాచ్‌మెంట్‌ను ప్రస్తావించిన నిమ్మల
- అజయ్ కల్లాం వాంగ్మూలాన్ని గుర్తుచేసిన మంత్రి

పెన్ పవర్ డెస్క్:వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు సునీల్ యాదవ్ ఇచ్చిన వాంగ్మూలంపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### లోకేశ్.. తీసుకున్న నిర్ణయంతో ఎమ్మెల్యేలు డమ్మీలుగా మారిపోయారా?

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలను టీడీపీ సీరియస్ గా తీసుకుంది. టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికయిన తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో నారా లోకేశ్ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. నారా లోకేశ్ ఇప్పటికే ఎమ్మెల్యేలందరికీ స్పష్టమైన ఆదేశాలు అందచేశారు. విజయం మన వైపే ఉండాలని చెప్పారు. అలాగే అభ్యర్థుల ఎంపికలోనూ ఎమ్మెల్యేలకు అవకాశం ఇవ్వకుండా కేంద్ర పార్టీ కార్యాలయమే బాధ్యతలను తీసుకోవడం ఇప్పుడు పార్టీలో చర్చనీయంశమైంది. ఎమ్మెల్యేలు తమకు అనుకూలురైన వారిని ఎంపిక చేస్తారన్న అనుమానం లోకేశ్ కు వచ్చినట్లుంది. అలాగయితే పార్టీ కోసం కష్టపడుతూ, జెండా పట్టుకున్న వారికి అన్యాయం జరుగుతుందని భావించి లోకేశ్ ఈ నిర్ణయం తీసుకున్నారంటున్నారు. కానీ స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులు ఎవరైనా వారిని గెలిపించుకుని రావాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపైనే పెట్టి లోకేశ్ వారికి పెద్ద బాధ్యతలను అప్పగించారు.

**పార్టీ కార్యాలయంలోనే...**

అభ్యర్థుల ఎంపికపై మంత్రి నారా లోకేశ్ పార్టీ కార్యాలయాల వేదికగా పారదర్శకమైన కసరత్తు నిర్వహించాలని కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పార్టీ కేంద్ర కార్యాలయానికి మేయర్, ఛైర్మన్ల పేర్లను మూడింటిని పంపాలని, ప్రాధాన్యత క్రమంలో పంపాలని కోరారు. అలాగే కౌన్సిలర్ పేర్లను కూడా పంపాలని తెలిపారు. ప్రతి కౌన్సిలర్, మేయర్ , ఛైర్మన్ స్థానిక స్థానానికి ముగ్గురు సమర్థులైన అభ్యర్థుల పేర్లను పరిశీలన కోసం తెలపాలని సూచించారు.అభ్యర్థుల ఎంపికలో వారి రాజకీయ నేపథ్యం, పార్టీ కోసం వారు చేసిన సేవలు, క్షేత్రస్థాయిలో ప్రజాబలం మరియు నిజాయితీకి పెద్దపీట వేయాలని లోకేశ్ స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను కేవలం వ్యక్తిగత సిఫార్సులకే పరిమితం చేయకుండా, పార్టీ కార్యాలయాల స్థాయిలో అధికారికంగా నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగదని లోకేశ్ భావిస్తున్నారు.

**ఎమ్మెల్యేలు నిర్ణయించిన వారే...**

అయితే అభ్యర్థులను గెలిపించుకోవాలంటే ఎమ్మెల్యేలు తమకు అనుకూలురైన వారిని పోటీకి దింపి అవసరమైతే వారికి ఆర్థిక సాయాన్ని కూడా అందచేస్తారు. ఇలా పార్టీ కేంద్ర కార్యాలయం ఎంపిక చేస్తే ఎమ్మెల్యేలు ప్రచారానికే పరిమితమవుతారమోనన్న అనుమానం కూడా పార్టీ నాయకత్వంలో ఉంది. తమకు అనుకూలురైన వారైతే వచ్చే సాధారణ ఎన్నికల్లో తమకు కష్టపడి పనిచేస్తారని, అదే పార్టీ కేంద్ర నాయకత్వం ఎంపిక చేసిన వారయితే తమను ఎదిరించే అవకాశాలుంటాయన్న భావన కూడా ఎమ్మెల్యేల్లో ఉంది. ఎప్పుడైనా స్థానిక సంస్థలకు అభ్యర్థుల ఎంపిక ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే జరుగుతుంది. కానీ నారా లోకేశ్ నేడు ఆ పద్ధతిని పూర్తిగా మార్చేశారు. అయితే ఇది కూటమి అభ్యర్థుల ఎంపిక విజయానికి దోహదపడుతుందా? లేక ఇబ్బందులు ఎదురవుతాయా? అన్న ప్రశ్నలు కూడా లేవనెత్తుతున్నాయి. అక్టోబర్‌లోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, వాయిదా పడతాయనే తప్పుడు ప్రచారాలను నమ్మకుండా నాయకులు, శ్రేణులు పూర్తిస్థాపనతో సిద్ధంగా ఉండాలని నారా లోకేశ్ దిశానిర్దేశం చేశారు. మొత్తం మీద నారా లోకేశ్ నిర్ణయంతో ఎమ్మెల్యేలు తాము డమ్మీలమయ్యామన్న భావనలో ఉన్నారు.

### రష్యా సైన్యంలో చేరొద్దు.. అది చాలా ప్రమాదకరం!

## భారతీయులకు కేంద్రం తీవ్ర హెచ్చరిక

రష్యా సైన్యంలో చేరడం అత్యంత ప్రమాదకరమని, అటువంటి నిర్ణయాలు తీసుకోవద్దని భారత ప్రభుత్వం తన పౌరులను మరోసారి గట్టిగా హెచ్చరించింది. ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో, ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రాణాలను పణంగా పెట్టవద్దని సూచించింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది.గత రెండేళ్లుగా హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, కొందరు భారతీయులు రష్యా సైన్యంలో చేరుతున్నట్లు నివేదికలు అందుతున్నాయని విదేశాంగ శాఖ పేర్కొంది. అధిక ఆదాయం వస్తుందన్న ఆశతో కొందరు స్వచ్ఛందంగా రష్యా సైన్యంలో చేరి, ఆ తర్వాత సమస్యలు ఎదురైనప్పుడు భారత ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తున్నారని వివరించింది. ఇది తీవ్ర ఆందోళన కలిగించే ధోరణి అని, ఇలాంటి చర్యలను ప్రభుత్వం ఏమాత్రం ప్రోత్సహించబోదని స్పష్టం చేసింది.తాత్కాలిక ఆర్థిక ప్రయోజనాల కోసం కొందరు భారతీయులు తమ భారత పౌరసత్వాన్ని వదులుకుని, రష్యా పాస్‌పోర్ట్ పొంది మరీ అక్కడి సైన్యంలో చేరుతున్న ఉదంతాలు తమ దృష్టికి వచ్చాయని విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి చర్యల వల్ల తలెత్తే ప్రాణాపాయ పరిస్థితులను పౌరులు గమనించాలని హితవు పలికింది.అనధికారిక ఏజెంట్లు, కొన్ని సంస్థలు సైతం అక్రమంగా రిక్రూట్‌మెంట్లు చేస్తున్నాయని, ఇటువంటి ఉద్యోగ ఆఫర్ల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని పౌరులకు విజ్ఞప్తి చేసింది. రష్యా సైన్యంలో ఉన్న భారతీయుల భద్రతతో పాటు, వారిని త్వరగా స్వదేశానికి రప్పించేందుకు రష్యా ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. ఇప్పటివరకు 139 మంది భారతీయులను సురక్షితంగా వెనక్కి రప్పించామని, మిగిలిన సుమారు రెండు డజన్ల మందిని కూడా రప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని విదేశాంగ శాఖ వెల్లడించింది.

# నాడు విశాఖకు ‘మణిహారం’...

# నేడు ప్రశ్నల సుడిగుండం!

ఇన్వెస్టిగేషన్ టీమ్, పెన్ పవర్ విశాఖపట్నం, సెప్టెంబర్ 30

ఒకప్పుడు చిన్న సముద్ర రేవు... కాలక్రమంలో దేశ వాణిజ్యానికి కీలక ద్వారం...విశాఖ నగర అభివృద్ధితో విడదీయలేని బంధం... వేలాది కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనాధారం... అదే విశాఖపట్నం పోర్టు. 1933లో ప్రారంభమైన ఈ ఓడరేవు ప్రయాణం తొమ్మిది దశాబ్దాలు దాటింది. నౌకలు వచ్చాయి... సరకు దిగింది... పరిశ్రమలు పెరిగాయి... ఉపాధి విస్తరించింది... విశాఖ నగర ఆర్థిక స్వరూపమే మారిపోయింది. ఇనుప ఖనిజం నుంచి బొగ్గు వరకు... ముడి చమురు నుంచి పెట్రోలియం ఉత్పత్తుల వరకు... ఎరువుల నుంచి ఇతర భారీ సరకు వరకు... సముద్రం నుంచి దేశ పారిశ్రామిక వ్యవస్థకు సరకు చేరే ప్రధాన ద్వారాల్లో విశాఖ పోర్టు తనదైన స్థానం సంపాదించుకుంది. అందుకే విశాఖకు పోర్టు అంటే కేవలం ఓడలు వచ్చిపోయే ప్రదేశం కాదు. అది ఉపాధి... అది వాణిజ్యం...అది పరిశ్రమ... అది నగర ఆర్థిక జీవనాడిలో ఒక భాగం.

**కానీ...**

ఇంతటి చరిత్ర కలిగిన సంస్థలో పరిపాలన, కమర్షియల్ నిర్ణయాలు, ఉద్యోగ వ్యవస్థపై ఇప్పుడు కొన్ని తీవ్రమైన ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఆ ప్రశ్నలకు సమాధానం వ్యక్తుల మాటల్లో కాదు. రికార్డుల్లో కనిపించాలి. అసలు పోర్టు ఎవరిది?..ముందుగా ఒక విషయం స్పష్టం... విశాఖపట్నం పోర్టు ఏ వ్యక్తికో, ఏ అధికారికో చెందిన ప్రైవేట్ సంస్థ కాదు... ఇది కేంద్ర ప్రభుత్వ వ్యవస్థలోని మేజర్ పోర్ట్ అథారిటీ... మరి అలాంటి సంస్థలో... వ్యవస్థ కంటే వ్యక్తులు బలంగా మారుతున్నారన్న ఆరోపణలు ఎందుకు వినిపిస్తున్నాయి? అధికారిక నిర్ణయాలు నిర్దేశిత విధానంలోనే జరుగుతున్నాయా? లేక కొందరు అధికారుల విచక్షణకు అసాధారణ ప్రాధాన్యం ఏర్పడిందా? ఫైల్‌లో ఉన్న నిబంధనే తుది మాటా? లేక ఫైల్ పట్టుకున్న వ్యక్తే తుది మాటగా మారుతున్నారా?

**ఇదే ‘పెన్ పవర్’ పరిశీలనలో మొదటి ప్రశ్న.**

రూల్ బుక్ నడుస్తోందా? వ్యక్తుల మాట నడుస్తోందా? ప్రభుత్వ వ్యవస్థలో ప్రతి నిర్ణయానికీ ఒక ప్రక్రియ ఉండాలి. ఎవరు ప్రతిపాదించారు? ఎవరు పరిశీలించారు? ఎవరు సిఫారసు చేశారు? ఎవరు ఆమోదించారు? ఏ నిబంధన కింద ఆమోదించారు? ఆ నిర్ణయానికి సంబంధించిన రికార్డు ఎక్కడుంది? ఇవన్నీ సమాధానం చెప్పగలిగితేనే పరిపాలనపై నమ్మకం నిలుస్తుంది. అందుకే విశాఖ పోర్టులో కమర్షియల్ వ్యవహారాలకు సంబంధించిన నిర్ణయాలను కూడా ఇదే కొలమానంతో చూడాల్సి ఉంది. ఒకే రకమైన వ్యవహారంలో అన్ని కంపెనీలకూ ఒకే విధానం అమలవుతోందా? ఫైళ్ల పరిష్కారంలో అనవసర ఆలస్యాలు ఉన్నాయా? ఉంటే వాటికి రికార్డుల్లో కారణాలు నమోదు చేస్తున్నారా? ఎవరి సిఫారసుతో ఏ నిర్ణయం తీసుకున్నారన్నది స్పష్టంగా కనిపిస్తుందా? ఇవి ఆరోపణలు కావు. పారదర్శక పరిపాలనలో సమాధానం ఉండాల్సిన ప్రశ్నలు.

**కిందిస్థాయి ఉద్యోగుల గొంతు ఎక్కడ?**

పోర్టు అంటే కేవలం చైర్‌పర్సన్ కార్యాలయం కాదు. కేవలం ఉన్నతాధికారుల ఏసీ గదులు కాదు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగి నుంచి కార్యాలయంలో ఫైల్ నిర్వహించే సిబ్బంది వరకు --- వేల చేతుల సమిష్టి శ్రమతోనే వ్యవస్థ ముందుకు సాగుతుంది. అయితే... కిందిస్థాయి ఉద్యోగి పైఅధికారి నిర్ణయాన్ని ప్రశ్నించగలడా? నిబంధనలకు విరుద్ధంగా ఉందని భావించిన అంశంపై అభ్యంతరం నమోదు చేయగలడా? లేక ప్రశ్నిస్తే బదిలీ, వేధింపులు లేదా ఇతర ఇబ్బందులు ఎదురవుతాయన్న భయం ఉందా? కొంతమంది ఉద్యోగుల నుంచి వినిపిస్తున్న ‘బాసిజం’, ఒత్తిళ్ల ఆరోపణల్లో వాస్తవం ఎంత? ఇక్కడ కూడా మాటలు కాదు... ఫిర్యాదులు, విజిలెన్స్ రికార్డులు, పరిపాలనా ఉత్తర్వులు, బదిలీ పత్రాలు, శాఖాపరమైన రికార్డులే నిజాన్ని తేల్చాలి.

**కమర్షియల్ విభాగం... అసలు కథ ఇక్కడే మొదలవుతోందా?**

ఒక భారీ కార్గో నౌక విశాఖ సముద్ర జలాల్లోకి వస్తోంది అనుకుందాం. అది పోర్టుకు రావడానికి ముందే ఒక పరిపాలనా ప్రక్రియ మొదలవుతుంది. నౌక వివరాలు... కార్గో వివరాలు...బెర్త్ లభ్యత...హ్యాండ్లింగ్ ఏర్పాట్లు... షిప్పింగ్ ఏజెంట్ వ్యవహారాలు... కమర్షియల్ అంశాలు... ఇలా అనేక స్థాయిల్లో నిర్ణయాలు ఉంటాయి.

**మరి ఈ నిర్ణయాల గొలుసులో ఎవరి పాత్ర ఎంత?**

అక్కడే అసలు కథ ఉంది. ఒక ఫైలు ఎక్కడ మొదలవుతోంది? ఎన్ని టేబుళ్లు దాటుతోంది? ఎవరు వ్యాఖ్యలు రాస్తున్నారు? ఎవరు సిఫారసు చేస్తున్నారు? చివరకు నిర్ణయం ఎవరు తీసుకుంటున్నారు? అధికారికంగా ఒకరికి ఉన్న అధికారం ఎంత? ఆచరణలో వారి ప్రభావం ఎంత? ఈ రెండింటి మధ్య వ్యత్యాసం ఉందా?

బెర్త్ కేటాయింపు... ఎవరి నిర్ణయం?

పోర్టులో బెర్త్ అంటే వ్యాపారపరంగా అత్యంత కీలకమైన అంశం. నౌక వేచి ఉండే ప్రతి గంటకూ ఆర్థిక విలువ ఉంటుంది. అందువల్ల బెర్త్ కేటాయింపులో పారదర్శకత అత్యంత కీలకం. ఏ నౌకకు ఎప్పుడు బెర్త్ ఇచ్చారు? దానికి ముందు ఎన్ని నౌకలు వేచి ఉన్నాయి? ప్రాధాన్యత నిర్ణయించడానికి ఉపయోగించిన ప్రమాణాలేమిటి?ఏదైనా నౌకకు ప్రాధాన్యత ఇచ్చినట్లయితే దానికి రికార్డుల్లో కారణముందా? ఈ వివరాలను తేదీలు, సమయాలు, నౌకల వారీగా పరిశీలిస్తే చాలా ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతాయి.

**కంపెనీ మారితే నిబంధన మారుతుందా?**

ఇది మరో కీలకమైన ప్రశ్న. ఒకే తరహా కార్గో... ఒకే తరహా పరిస్థితులు... వేర్వేరు కంపెనీలు. అప్పుడు నిర్ణయాలు కూడా ఒకే విధంగా ఉంటున్నాయా? లేక ఒక కంపెనీ ఫైలు వేగంగా కదిలి మరో కంపెనీ ఫైలు ఆలస్యమవుతోందా? అలా జరిగితే కారణం ఏమిటి? సాంకేతిక సమస్యా? పత్రాల లోపమా? బెర్త్ అందుబాటులో లేకపోవడమా? లేక మరేదైనా కారణమా? ఫైల్ నోటింగ్స్ ఈ ప్రశ్నకు సమాధానం చెప్పగలవు.

**‘ప్రైవేట్ సామ్రాజ్యం’ అన్న ఆరోపణ ఎందుకు?**

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఒక మేజర్ పోర్టును “కొంతమంది అధికారుల ప్రైవేట్ సామ్రాజ్యం”గా అభివర్ణించడం చాలా తీవ్రమైన ఆరోపణ. అందుకే దానిని నినాదంగా వదిలేయడం కాదు... పరీక్షించాలి. ఒక అధికారి తనకు చట్టబద్ధంగా ఉన్న అధికార పరిధిలోనే పనిచేస్తున్నారా? లేక అధికార పరిధిని మించి నిర్ణయాలపై ప్రభావం చూపుతున్నారా? ఒక వ్యక్తి లేకుండా ఫైలు ముందుకు కదలదన్న పరిస్థితి నిజంగా ఉందా? అలా ఉంటే దానికి రికార్డు ఆధారం ఏమిటి? లేక ఇవన్నీ అసంతృప్తితో వస్తున్న ఆరోపణలేనా? రెండు అవకాశాలనూ సమానంగా రికార్డుల ముందు నిలబెట్టాల్సిందే.

**విజిలెన్స్ ఏం చెబుతోంది?**

ఇంతటి ప్రశ్నలు వినిపిస్తున్నప్పుడు మరో కీలక అంశం విజిలెన్స్. కమర్షియల్ వ్యవహారాలపై గతంలో ఫిర్యాదులు వచ్చాయా? ఏ అధికారిపైనైనా లిఖితపూర్వక ఫిర్యాదులు నమోదయ్యాయా? వాటిపై ప్రాథమిక పరిశీలన జరిగిందా? ముగిసిన ఫిర్యాదుల ఫలితం ఏమిటి? పెండింగ్‌లో ఉన్నవి ఎన్ని? ఫిర్యాదులు లేకపోతే --- ఆరోపణలకు మూలం ఏమిటి? ఇవన్నీ తెలుసుకోవాల్సిన అంశాలే.

పెన్ పవర్ ఎవరికీ ముందే తీర్పు ఇవ్వడం లేదు, ఈ కథనంలో అత్యంత ముఖ్యమైన అంశం ఇదే. ఏ అధికారినీ ముందుగానే దోషిగా ప్రకటించడం ‘పెన్ పవర్’ లక్ష్యం కాదు. అదే సమయంలో ఒక ప్రభుత్వ సంస్థలో పరిపాలన, కమర్షియల్ నిర్ణయాలు, ఉద్యోగులపై ఒత్తిళ్లు లేదా వ్యక్తిగత ప్రభావం గురించి ప్రశ్నలు తలెత్తినప్పుడు వాటిని పట్టించుకోకుండా వదిలేయడం కూడా జర్నలిజం కాదు. ఆరోపణ వస్తే ప్రశ్నిస్తాం. సమాధానం కోరుతాం. రికార్డు వెతుకుతాం. రెండు వైపుల వాదన తీసుకుంటాం. ఆ తర్వాత వాస్తవాన్ని పాఠకుడి ముందుంచుతాం.

**అదే ఈ గ్రౌండ్ రిపోర్ట్ ఉద్దేశం.**

93 ఏళ్ల ప్రతిష్ఠ...ఒక్కరి సొత్తు కాదు! విశాఖ పోర్టు ప్రతిష్ఠ ఏ ఒక్క అధికారి కంటే పెద్దది. ఏ ఒక్క విభాగం కంటే పెద్దది. ఏ ఒక్క షిప్పింగ్ కంపెనీ కంటే పెద్దది. ఎందుకంటే ఇది ప్రజా వ్యవస్థ. దేశ వాణిజ్య ప్రయోజనాలతో ముడిపడిన సంస్థ. అందుకే ఆరోపణలు అవాస్తవమైతే వాటిని రికార్డులతో ఖండించాలి. నిజమైతే బాధ్యులపై చర్య తీసుకోవాలి. కానీ... మౌనం మాత్రం సమాధానం కాదు.

‘పెన్ పవర్’ అడుగుతున్న ప్రశ్నలు

విశాఖ పోర్టులో వ్యవస్థ బలంగా ఉందా?.. వ్యక్తులు బలంగా ఉన్నారా? రూల్ బుక్ నడుస్తోందా?.. కొందరి మాటే రూల్‌గా మారుతోందా? కమర్షియల్ నిర్ణయాల్లో అందరికీ సమాన అవకాశముందా? బెర్త్ కేటాయింపులో ప్రతి నిర్ణయానికీ రికార్డు ఆధారం ఉందా? కిందిస్థాయి ఉద్యోగులు స్వేచ్ఛగా తమ అభిప్రాయం చెప్పగలుగుతున్నారా?విజిలెన్స్‌కు అందిన ఫిర్యాదులు ఏమయ్యాయి? కమర్షియల్ ఫైళ్లను బయటపెడితే కనిపించేది పారదర్శకతా?.. లేక ఇప్పటివరకు బయటకు రాని మరో కథా? సమాధానాలు ఊహల్లో వద్దు. రికార్డుల్లో కావాలి.

**అందుకే... మొదలైంది ‘పెన్ పవర్’ గ్రౌండ్ రిపోర్ట్!**

**ఎపిసోడ్--2లో...**

**“కమర్షియల్‌లో ఎవరి మాట నడుస్తోంది?”**

**నౌక రాక నుంచి బెర్త్ కేటాయింపు వరకు...**

**కార్గో హ్యాండ్లింగ్ నుంచి కమర్షియల్ నిర్ణయాల వరకు...**

**ఫైలు ఎవరి టేబుల్‌పైకి వెళ్తుంది?**

**ఎవరు సిఫారసు చేస్తారు?**

**తుది నిర్ణయం ఎవరిది?**

**రికార్డులు ఏం చెబుతున్నాయి?**

**చదువుతూనే ఉండండి పెన్ పవర్ తెలుగు, హిందీ మరియు ఇంగ్లీష్ దిన పత్రికలు**

**ఈ కథనాలపై మీ వద్ద ఆధారాలు/ అభ్యాంతరాలు ఉంటే నేరుగా ఈ నెంబర్ లో కాంటాక్ట్ చేయండి : 9059465965 ,** mail id : editorpenpower@gmail.com

## ‘బాబాయ్ హత్యతో అబ్బాయికే లాభం’.. జగన్ మౌనంపై మంత్రి నిమ్మల ప్రశ్నలు

- మొదటి పేజి తరువాయి

నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. వివేకా హత్యతో అంతిమంగా లబ్ధి పొందింది జగన్, ఆయన కుటుంబ సభ్యులు, అవినాష్‌రెడ్డి అని సునీల్ యాదవ్ చెప్పినట్లు మంత్రి పేర్కొన్నారు.మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిమ్మల మాట్లాడారు. సునీల్ యాదవ్ కోర్టులో తనకు ప్రాణహాని ఉందని చెప్పినా తాడేపల్లి ప్యాలెస్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తనను కాకుండా అంతిమ లబ్ధిదారులైన జగన్, అవినాష్‌రెడ్డి కుటుంబ సభ్యులను విచారిస్తే అసలు విషయాలు బయటకు వస్తాయని సునీల్ చెప్పినట్లు తెలిపారు.

వివేకా హత్య కేసుతో సంబంధం ఉన్న పలువురు కీలక వ్యక్తులు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడంపైనా మంత్రి ప్రశ్నలు లేవనెత్తారు. కసనూరు శ్రీనివాస్‌రెడ్డి, ఈసీ గంగిరెడ్డి, కువైట్ గంగాధర్‌రెడ్డి, డ్రైవర్ నారాయణ, వైఎస్ అభిషేక్‌రెడ్డి, వాచ్‌మెన్ రంగయ్య తదితరుల మరణాలపై సమాధానాలు రావాల్సి ఉందన్నారు.హత్యకు రూ.40 కోట్ల సుపారీ ఇచ్చినట్లు వచ్చిన అంశాన్ని కూడా నిమ్మల ప్రస్తావించారు. అంత పెద్ద మొత్తాన్ని ఇచ్చే ఆర్థిక సామర్థ్యం ఎర్ర గంగిరెడ్డి, శివశంకర్‌రెడ్డికి లేదని.. రాజకీయంగా లబ్ధి పొందిన జగన్ కుటుంబానికే ఆ సామర్థ్యం ఉందని ఆరోపించారు. సుపారీకి సంబంధించిన నగదులో రూ.40 లక్షలను ఈడీ అటాచ్ చేసిందని చెప్పారు.

హత్య జరిగిన రోజు తెల్లవారుజామునే వివేకానందరెడ్డి చనిపోయిన విషయం జగన్‌కు తెలిసినా.. సాయంత్రం వరకు పులివెందుల వెళ్లకుండా హైదరాబాద్‌లో ఎందుకు ఉన్నారని మంత్రి ప్రశ్నించారు. నాటి ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఘటనాస్థలంలో రక్తపు మరకలను తొలగించి, గుండెపోటుగా ప్రచారం చేయడం ద్వారా ఆధారాలను మార్చేందుకు ప్రయత్నించారని నిమ్మల ఆరోపించారు. గతంలో సీబీఐ దర్యాప్తు కోరిన జగన్.. ముఖ్యమంత్రి అయ్యాక విచారణను అడ్డుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు.దస్తగిరి, సునీల్ యాదవ్ వాంగ్మూలాలు, దర్యాప్తు సంస్థల నివేదికలు, గూగుల్ టేక్‌అవుట్ ఆధారాలు, ఈడీ అటాచ్‌మెంట్లు కేసులో కీలకంగా ఉన్నాయని మంత్రి అన్నారు. నిందితులు తనపై ఆరోపణలు చేస్తున్నా జగన్ స్పందించకపోవడం ప్రజల్లో అనుమానాలు పెంచుతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా వివేకా హత్యపై జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలని నిమ్మల డిమాండ్ చేశారు.

## తిరుపతి నుంచి వారణాసికి 25 బైక్‌లు.. టీడీపీ నేతల సేవా సంకల్ప యాత్ర!

- మొదటి పేజి తరువాయి

ఆయన ప్రారంభించారు. 25 మంది బైక్ రైడర్లు ఈ యాత్రలో పాల్గొంటున్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు ఆదేశాలు, మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు టీడీపీ విద్యార్థి విభాగం (టీఎన్‌ఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో ఈ యాత్ర నిర్వహిస్తున్నారు.తిరుపతిలోని అలిపిరి నుంచి శ్రీవారి ఆశీస్సులతో ప్రారంభమైన ఈ యాత్ర.. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ మీదుగా సాగనుంది. సుమారు ఎనిమిది రోజుల పాటు కొనసాగి అక్టోబర్ 8న వారణాసికి చేరుకోనుంది. ఆయా రాష్ట్రాల్లో భాజపా నాయకులు యాత్రకు స్వాగతం పలకనున్నారు. టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు, యువ నేతలు కూడా ఇందులో పాల్గొంటున్నారు.ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో నిబద్ధతతో పనిచేసే నాయకత్వానికి నరేంద్ర మోదీ, చంద్రబాబు నాయుడు నిదర్శనమని అన్నారు. సమాజ నిర్మాణం, ప్రజా సేవ కోసం నిరంతరం

కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు.అదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడుల ఆకర్షణకు కృషి చేస్తున్నామని పల్లా తెలిపారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యమని చెప్పారు. మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను గుర్తిస్తూ నిర్వహిస్తున్న ఈ యాత్రలో భాగస్వామి కావడం ఆనందంగా ఉందన్నారు. యాత్రలో పాల్గొంటున్న బైక్ రైడర్లకు శుభాకాంక్షలు తెలిపారు.

## మోదీ-ట్రంప్ ఫోన్ కాల్.. వాణిజ్యం, రక్షణ, ఇంధనంపై కీలక చర్చలు

- మొదటి పేజి తరువాయి

చర్చించారు. ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నేతలు పునరుద్ఘాటించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. అలాగే భవిష్యత్తులోనూ పరస్పరం సంప్రదింపులు కొనసాగించాలని నిర్ణయించినట్లు పేర్కొంది.భారత్–అమెరికా సంబంధాల్లో వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతల వంటి రంగాలు ముఖ్యమైనవిగా కొనసాగుతున్నాయి. ఇరు దేశాల మధ్య వాణిజ్య సహకారం కొనసాగుతున్నప్పటికీ, ప్రస్తుతం సమగ్ర ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లో లేదని విదేశాంగ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియా–యూఎస్ ట్రేడ్ ఫెసిలిటేషన్ పోర్టల్ పేర్కొంటోంది.

గతంలోనూ మోదీ, ట్రంప్ పలుమార్లు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో జీ7 సదస్సు సందర్భంగా ఇద్దరూ భేటీ అయి భారత్–అమెరికా సంబంధాలపై చర్చించినట్లు విదేశాంగ శాఖకు సంబంధించిన వివరాలను ఉటంకిస్తూ తాజా నివేదికలు తెలిపాయి.

## మహిళలకు ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

- మొదటి పేజి తరువాయి

జిల్లాలో లబ్ధిదారులకు సగటున 130 గజాల స్థలానికి పట్టాలు అందించినట్లు చెప్పారు. ఇది పేదల ఆత్మగౌరవానికి కట్టబెట్టిన పట్టాభిషేకమని, వారి చిరకాల వాంఛను నెరవేర్చామని పేర్కొన్నారు.గత ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో డబుల్ ఇంజన్ సర్కార్ ఇప్పుడు జెట్ స్పీడ్‌తో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తోందని చంద్రబాబు అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తున్నామని, కూటమి ప్రభుత్వం ప్రతీ పేదవాడికి న్యాయం చేసేందుకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు విశాఖ, మంగళగిరి, విజయవాడ కార్యక్రమాలతో కలిపి సుమారు 60,000 పట్టాలు పంపిణీ చేశామని, వాటి విలువ సుమారు రూ.52,000 కోట్లు ఉంటుందని వివరించారు. లబ్ధిదారులు ఈ ఆస్తిని అమ్ముకోవద్దని, భవిష్యత్ కోసం కాపాడుకోవాలని సూచించారు.మహిళల కోసం ‘స్త్రీ శక్తి’ పథకం కింద ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తున్నామని, భవిష్యత్తులో ఏసీ బస్సులను కూడా కొనుగోలు చేసి వాటిలోనూ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

## విమానాన్ని కూల్చివేసేందుకు యత్నించాడు

- మొదటి పేజి తరువాయి

అసమాన ధైర్యసాహసాలు, సమయస్ఫూర్తి ప్రదర్శించి.. ఎంతోమంది ప్రాణాలను కాపాడారని, వారికి సెల్యూట్ చేస్తున్నట్లు నెతన్యాహు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాడికి పాల్పడిన పైలట్‌ను సౌదీ అరేబియా పోలీసులు అరెస్టు చేశారని వెల్లడించారు. దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌కు బయల్దేరిన ఫ్లైదుబాయ్ విమానంలో కెప్టెన్‌పై కో–పైలట్ కత్తితో దాడి చేసిన ఘటన తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే.

# ‘త్రిశూల్’తో మహిళల భద్రత.. రోడ్డు భద్రత.. గంజాయి నిర్మూలన



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 30:** మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, గంజాయి నిర్మూలన లక్ష్యంగా గూడెంకొత్తవీధి పోలీసులు ‘త్రిశూల్’ కార్యక్రమాన్ని చేపట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ ఆదేశాల మేరకు ఎస్ఐ కె. సురేష్ ఆధ్వర్యంలో జీకేవీధి కేజీబీవీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల రక్షణ, రహదారి భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించడంతో పాటు గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. వాటి నిర్మూలనకు ప్రజల సహకారం అవసరమని పోలీసులు సూచించారు. మహిళల భద్రత, రోడ్డు భద్రత, గంజాయి నిర్మూలన అనే మూడు అంశాలను లక్ష్యంగా చేసుకుని ‘త్రిశూల్’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ కె. సురేష్ తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో సురక్షిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | మన్యం | విజయనగరం | విశాఖపట్నం | అనకాపల్లి | అల్లూరి జిల్లా

# ఏబులం టేకులవీధిలో నిర్మాణాలపై రెవెన్యూ విచారణ





PEN POWER 24 NEWS
పెన్ పవర్
తెలుగు దిన పత్రిక ప్రశ్నించడం మన హక్కు

## ఏబులం టేకులవీధిలో నిర్మాణంపై పీసా కమిటీ అభ్యంతరం

అనుమతులపై స్పష్టత ఇవ్వాలని అధికారులకు వినతి

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 29:** గూడెంకొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ సచివాలయం-2 పరిధిలోని ఏబులం టేకులవీధి గ్రామంలో జరుగుతున్న ఓ నిర్మాణానికి సంబంధించి అనుమతులు, ఆధార పత్రాలపై స్పష్టత ఇవ్వాలని స్థానిక పీసా కమిటీ ప్రతినిధులు కోరారు. గ్రామంలో జరుగుతున్న నిర్మాణ పనులను పీసా కమిటీ ప్రతినిధులు గబులంగి గణేశ్, కొయ్యం ఇమాన్యుల్ (సిద్దు) మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణానికి సంబంధించిన అనుమతి పత్రాలు అక్కడ అందుబాటులో లేవని వారు గుర్తించి, ఈ విషయాన్ని మండల పీసా కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశంపై పీసా మండల కమిటీ అధ్యక్షులు కొర్ర బలరాం, కార్యదర్శి మాదిరి చంటిబాబు మాట్లాడుతూ నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ, పంచాయతీ శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా అధికారులు పరిశీలించి స్పష్టత ఇవ్వాలని కోరారు. నిబంధనల ప్రకారం అనుమతులు ఉన్నట్లయితే ఎలాంటి అభ్యంతరం లేదని, లేనిపక్షంలో సంబంధిత నిబంధనల మేరకు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని సూచించారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో నిర్మాణాలు, భూముల వినియోగానికి సంబంధించిన నిబంధనలను పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, స్థానికుల సందేహాలను నివృత్తి చేసే విధంగా పూర్తి వివరాలను వెల్లడించాలని కోరారు. ఈ విషయంపై గూడెంకొత్తవీధి తహశీల్దార్ హెచ్. అన్నాజీరావు వివరణ కోరగా ఆయన స్పందిస్తూ.. సంబంధిత నిర్మాణానికి రెవెన్యూ శాఖ నుంచి ఎటువంటి అనుమతులు జారీ కాలేదని తెలిపారు. నిర్మాణానికి సంబంధించిన అంశాలపై తక్షణమే విచారణ చేపట్టేందుకు అధికారులను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. విచారణ అనంతరం నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

epaper.penpower.in | 2026-09-30 | Page: 3
For more details, visit epaper.penpower.in

పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

- రంగంలోకి దిగిన రెవెన్యూ యంత్రాంగం.. నిర్మాణ పనులు తాత్కాలికంగా నిలిపివేత
- పూర్తిస్థాయి విచారణ తర్వాతే తదుపరి చర్యలు: ఆర్ఐ బాలమజ్జి

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 30:** మండలంలోని ఏబులం టేకులవీధిలో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై పెన్ పవర్ పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నిర్మాణాలపై పెసా కమిటీ అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో బుధవారం రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలన చేపట్టారు. అనంతరం సంబంధిత నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేశారు. ఏబులం టేకులవీధిలో పేపర్ ప్లేట్ పరిశ్రమ, కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం, వాటర్ ప్లాంట్‌కు సంబంధించిన నిర్మాణాలు చేపడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నిర్మాణాలకు సంబంధించి గ్రామ పంచాయతీ, రెవెన్యూ శాఖలతో పాటు పెసా కమిటీ నుంచి అవసరమైన ముందస్తు అనుమతులు ఉన్నాయా లేదా అనే అంశంపై అధికారులు విచారణ చేపట్టారు. గిరిజన ప్రాంతాల్లో కీలకమైన గ్రామసభ తీర్మానం, ఇతర అనుమతులపై కూడా వివరాలు సేకరిస్తున్నారు. నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు, పత్రాలు, లైసెన్సులను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు. అప్పటివరకు నిర్మాణ పనులు కొనసాగించరాదని సంబంధిత వ్యక్తులకు సూచించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలమజ్జి మాట్లాడుతూ.. సదరు నిర్మాణాలపై పూర్తిస్థాయి విచారణ కొనసాగుతోందన్నారు. అన్ని పత్రాలు, అనుమతులను పరిశీలించిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. సంబంధిత యజమానులు అన్ని ప్రభుత్వ శాఖల నుంచి చట్టబద్ధమైన అనుమతులు పొందిన తర్వాతే నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించాల్సి ఉంటుందని తెలిపారు. అప్పటివరకు పనులను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, నిర్మాణాలపై రింతాడ పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్ వివరణ ఇస్తూ.. అక్కడ మూడు రకాల నిర్మాణాలు ఉన్నందున వాటిని పరిశ్రమలుగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత నిర్మాణాలకు పీసా, రెవెన్యూ శాఖల అనుమతులు ఉన్నట్లయితేనే పంచాయతీ పరిధిలో అనుమతులపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. పెన్ పవర్‌లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేయడంతో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# బాలల హక్కుల పరిరక్షణకు సమష్టి కృషి అవసరం



- జిల్లా కలెక్టర్ టి. నిషాంతి

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 30:** బాలల భద్రత, విద్య, ఆరోగ్యం, పోషణ, గౌరవం, సమాన అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ టి. నిషాంతి అధికారులను సూచించారు. బుధవారం పాడేరు శంకరం హాల్‌లో విద్యాశాఖ, స్త్రీ--శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ ఒక్క శాఖ బాధ్యత కాదని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. పాఠశాలలు, వసతి గృహాల్లో బాలల భద్రతా ప్రమాణాలను పర్యవేక్షించాలని, శారీరక శిక్షలు, వేధింపులు, వివక్షను పూర్తిగా నివారించాలని సూచించారు. బాల కార్మికత్వం, బాల్యవివాహాలు, బాలల అక్రమ రవాణా, దోపిడీ వంటి సమస్యలను అరికట్టేందుకు పోలీస్, విద్య, కార్మిక, రెవెన్యూ, మహిళా--శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. తప్పిపోయిన పిల్లల విషయంలో తక్షణమే స్పందించి వారి భద్రత, కుటుంబంతో పునరేకీకరణ, కౌన్సెలింగ్, పునరావాసానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. బాలల ఆరోగ్యం, పోషణ, రక్తహీనత నివారణ, వైద్య పరీక్షలు, ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు అవసరమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గిరిజన, మారుమూల ప్రాంతాల్లో బాలల హక్కులు, బాల్యవివాహాలు, బాల కార్మికత్వం, అక్రమ రవాణాపై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన బాలికలకు కలెక్టర్ బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి డా. టి. సద్దు, బాలల సంరక్షణ అధికారి కె. రాజశేఖర్, అధికారులు, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది, విద్యాశాఖ, స్త్రీ--శిశు సంక్షేమ శాఖల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విశాఖ గాలికి కాలుష్య కాటు తగ్గేనా?

- భారీ వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గాలపై కసరత్తు
- గాలి నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ



**విశాఖ పెన్ పవర్ సెప్టెంబర్ 30 :**విశాఖ నగరంలో పెరుగుతున్న వాయు కాలు ష్యాన్ని నియంత్రించేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టనున్నట్లు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ డా. పి. కృష్ణయ్య తెలిపారు. గంగవరం పోర్టు, ఉక్కు కర్మాగారం నుంచి గాజువాక మీదుగా రాకపోకలు సాగిస్తు న్న భారీ వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల కు మళ్లించే అంశంపై జీవీఎంసీ, రవాణా శాఖ అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటా మని చెప్పారు. వాయు కాలుష్య నియంత్రణ, గాలి నాణ్యత నిరంతర పర్యవేక్షణ, పోర్టులు, పారిశ్రామిక కార్యకలాపాల కారణంగా ఏర్పడు తున్న కాలుష్యాన్ని తగ్గించే అంశాలపై ఆంధ్రప్ర దేశ్ కాలుష్య నియంత్రణ మండలి, గ్రేటర్ విశా ఖ పౌర వేదిక ప్రతినిధులతో దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌ ర వేదిక ప్రతినిధులు ప్రస్తావించి నపలు అంశా లపై ఛైర్మన్ స్పందించారు. విశాఖ నగరంలో గాలి నాణ్యతను పర్యవేక్షిం చేందుకు ప్రస్తుతం ఎనిమిది మాన్యువల్ కేంద్రా లు ఉన్నాయని తెలిపారు. నిరంతర గాలి నా ణ్యత పర్యవేక్షణ కోసం మరో మూడు కేంద్రాల ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నవంబరు నాటికి మరో ఐదు ఇంటర్నెట్ ఆధారిత సెన్సార్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు.

### పోర్టుల్లో కాలుష్య నియంత్రణకు చర్యలు

విశాఖపట్నం పోర్టులో కాలుష్య నియంత్రణకు అవసరమైన యాంత్రీకరణ పనులు ఇప్పటివ రకు 40 శాతం పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఛైర్మన్ సూచించారు. అవసర మైన చర్యలు పూర్తికాకపోతే తదుపరి నిర్వహ ణ అనుమతి పునరుద్ధరణ సమయంలో నిబం ధనల మేరకు చర్యలు తీసుకునే అంశాన్ని పరిశీ లించాలని అధికారులను ఆదేశించారు.
పోర్టు పరిధిలో దుమ్ము కాలుష్యాన్ని తగ్గించేం దుకు లారీలపై కప్పులు ఏర్పాటు చేయడంతో పాటు రహదారులపై నీటిని పిచికారీ చేస్తున్నట్లు ప్రాంతీయ కాలుష్య నియంత్రణ మండలి అధికా రులు తెలిపారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ఆమో దించిన రసాయనాలను వినియోగించేలా విశా ఖపట్నం పోర్టు అధికారులకు సూచనలు ఇవ్వా లని ఛైర్మన్ ఆదేశించారు. గంగవరం పోర్టులోనూ జాతీయ హరిత న్యాయ స్థానం మార్గదర్శకాలను అమలు చేయాలన్న పౌర వేదిక ప్రతిపాదనపై ఛైర్మన్ సానుకూలంగా స్పందించారు.

### నిర్మాణ పనుల ధూళిపైనా నిఘా

నిర్మాణ, కూల్చివేత పనుల వల్ల ఉత్పన్నమ య్యే ధూళి కాలుష్యాన్ని పర్యవేక్షించేందుకు ని ర్మాణ సంస్థలు తక్కువ ఖర్చుతో కూడిన ధూళి కొలిచే పరికరాలను వినియోగించే విధానాన్ని పరిశీలించాలని పౌర వేదిక ప్రతినిధులు సూచిం చారు. కాలుష్య నియంత్రణలో ప్రజల భాగస్వా మ్యాన్ని పెంచేందుకు నివాస సంక్షేమ సంఘా లు, పౌర సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో సమ న్వయ వేదిక ఏర్పాటు చేయాలని డా. కృష్ణయ్య సూచించారు. నిర్మాణ ధూళి, ప్లాస్టిక్ వినియో గం, చెత్తను వేరు చేయడం, పరిసరాల పరిశుభ్ర త వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. పౌర సంఘాలు, నిర్మాణ సంస్థలు, నివాస సంక్షే మ సంఘాలు, జీవీఎంసీ, కాలుష్య నియంత్రణ మండలి తదితర సంస్థలు సమన్వయంతో పని చేస్తే స్థానిక స్థాయిలో కాలుష్య నియంత్రణ చ ర్యలను మరింత సమర్థవంతంగా అమలు చే యవచ్చని ఛైర్మన్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి శరవణన్, ముఖ్య పర్యావరణ ఇంజినీర్ ఎం. రాజశేఖర్, సంయుక్త ముఖ్య పర్యావరణ శాస్త్రవేత్త శ్రీరంజని, సంయుక్త ముఖ్య పర్యావరణ ఇంజినీర్ మహేశ్వరరావు, విశాఖపట్నం ప్రాంతీయ అధికారులు, గ్రేటర్ విశాఖ పౌర వేదిక అధ్యక్షుడు సోహన్ హట్టంగ డి, కార్యదర్శి కెప్టెన్ ఎన్. విశ్వనాథన్ తదితరు లు పాల్గొన్నారు.

# స్థానికులకే టికెట్ ఇవ్వాలి.. 15వ వార్డులో వైసీపీ శ్రేణుల డిమాండ్





మొల్లి హేమంత్ కు బలమైన మద్దతు - నాన్ లోకల్ కు నో అంటున్న వార్డు నేతలు

**విశాఖ తూర్పు,పెన్ పవర్, సెప్టెంబర్ 30:**తూర్పు నియోజకవర్గం నూతన 15వ వార్డులో టిఐసి పాయింట్ వద్ద వార్డు అధ్యక్షుడు మొల్లి హేమంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం వేదికగా స్థానిక నేతల ఆత్మగౌరవ నినాదం వినిపించింది. వార్డు వైసీపీ నాయకుడు మొల్లి హేమంత్ కు వార్డు నాయకులు, కార్యకర్తలు బలమైన మద్దతు ప్రకటించారు. వచ్చే జీవీఎంసీ ఎన్నికల్లో స్థానికులకే కార్పొరేటర్ టికెట్ కేటాయించాలని, స్థానికేతరులను తాము సహించబోమని ఈ సందర్భంగా పరోక్షంగా సంకేతం ఇచ్చారు. వార్డులో ఉంటూ ప్రజల కష్టసుఖాలు తెలిసిన మొల్లి హేమంత్ లాంటి స్థానిక నాయకుడికే అవకాశం ఇవ్వాలని నేతలు అభిప్రాయపడ్డారు. అయితే, పార్టీ నిర్ణయమే అంతిమమని, అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా తమ వంతు పూర్తి మద్దతు ఉంటుందని సీనియర్ నాయకులు స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయాల మేరకే నాయకులు, కార్యకర్తలు కట్టుబడి పనిచేయాలని తూర్పు నియోజకవర్గ నాయకులను, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యాలయ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పరిశీలకురాలు పెడాడ రమణి కుమారి, గొలగాని శ్రీనివాస్. రాష్ట్ర అధికార ప్రతినిధులు పల్లా దుర్గారావు, పీవీ నారాయణ, వార్డ్ ఇంచార్జ్ పీతల గోవింద్, రాజబాబు,బోని శివరామకృష్ణ, కన్నేటి సుబ్బారెడ్డి. సంపంగి సురేష్. తదితరులు పాల్గొన్నారు. 16,17 వ వార్డు నుండి అధిష్టానం నిర్ణయిస్తే సత్యాల వెంకట్. గూడపాటి విక్టర్,లను అభ్యర్థులుగా పోటీ చేయడానికి అధిష్టానం నిర్ణయం తీసుకోవాలని పార్టీ పెద్దలు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.

# సంతలో పోలీస్ చట్టాలపై అవగాహన సదస్సు



- వారపు సంతనుండి పంచాయతీ కేంద్రం వరకు భారీ అవగాహన ర్యాలీ.
- ముంచంగిపుట్టు ఎస్ఐ పి నాని.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 30.** అల్లూరి జిల్లా ఎస్పీ ఆదేశాలతో ముంచింగిపుట్టు పోలీస్ స్టేషన్ పరిధిలోని బంగారుమెట్ట బుదవారం సంతవద్ద ‘ఆపరేషన్ త్రిశూల్’ కార్యక్రమంలో భారీ ర్యాలీతో ప్రజలకు పోలీస్ చట్టాలపై అవగాహన కల్పించినట్లు ఎస్ఐ పి నాని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు, పిల్లల భద్రత, రోడ్డు భద్రత మరియు గంజాయి మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యంగా ‘ఆపరేషన్ త్రిశూల్’ చేపట్టినట్లు తెలిపారు. గంజాయి, సారా వినియోగం వల్ల జరిగే నష్టాలు, సైబర్ నేరాలు మోసాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై సూచించారు. యువత ట్రాఫిక్ నిబంధనలు, బాల్యవివాహాల నిరోధం, మహిళలపై జరుగుతున్న నేరాల అదుపు మరియు పోక్సో చట్టం గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఏదైనా అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల వైసీపీ నేతలుకొండలరావు, జగన్నాధం, పోలీస్ సిబ్బంది, ప్రజలు వ్యాపారులు పాల్గొన్నారు.

# విజయనగరం కోటలో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం--2026



### కృత్రిమ మేధస్సుతో పర్యాటక రంగ పునర్నిర్మాణం -- డా.తెంటు అనిల్

**స్టాఫ్ రిపోర్టర్ , పెన్ పవర్ విజయనగరం, సెప్టెంబర్ 30:** కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్ (జుఖ్యూ), మహారాజా కళాశాల (ఎ) సంయుక్తంగా "డిజిటల్ అజెండా మరియు కృత్రిమ మేధస్సుతో పర్యాటక రంగ పునర్నిర్మాణం" అనే ఇతివృత్తంతో ప్రపంచ పర్యాటక దినోత్సవం--2026ను విజయనగరం కోటలో నిర్వహించాయి.కార్యక్రమం జ్యోతి ప్రజ్వలనంతో ప్రారంభమై, అనంతరం డా. పి.వి.జి. రాజు గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.డిపార్ట్‌మెంట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ హెడ్ డా. కుసుమ పర్యాటక ప్రక్రియ, సమకాలీన సవాళ్లు, ఇటీవలి అభివృద్ధులు, కెరీర్ అవకాశాలపై ప్రసంగిస్తూ, విద్యార్థులు పరిశ్రమకు అనుగుణమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.రిజిస్ట్రార్ ఇన్‌చార్జి, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ ప్రొ. జితేంద్ర మోహన్ మిశ్రా పర్యాటక రంగానికి మానవ జీవితంతో ఉన్న నైతిక అనుసంధానాన్ని ప్రస్తావిస్తూ, మానవ విలువలు, స్థానిక సమాజాలు, సంస్కృతి, వారసత్వ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

విశిష్ట అతిథి ప్రొ. కె.వి.ఎల్. రాజు, కరస్పాండెంట్, మాన్సాస్ పర్యాటక రంగ చారిత్రక ఆవిర్భావం, పరివర్తనలు, సాంకేతిక జోక్యాలపై ప్రసంగిస్తూ, వారసత్వాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానించే అవకాశాలను వివరించారు.విశిష్ట అతిథి హాస్పిటాలిటీ నిపుణులు కందుల అర్జున్ల, స్వాగత్ హోటల్స్ 21వ శతాబ్దంలో పర్యాటక, హోటల్ మేనేజ్‌మెంట్ రంగాలకు అవసరమైన వృత్తిపరమైన నైపుణ్యాలు, సేవా ప్రమాణాలు, ప్రాయోగిక అనుభవం గురించి వివరించారు.ముఖ్య అతిథి డా. అనిల్ కుమార్ టెంటు, డిప్యూటీ డైరెక్టర్, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి మరియు శిక్షణ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కృత్రిమ మేధస్సుతో పర్యాటక రంగ పునర్నిర్మాణంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు. పర్యాటక రంగంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక అవకాశాలు, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రస్తావించారు.

వీసీ ఇన్‌చార్జి ప్రొ. టి. శ్రీనివాసన్ తన ముగింపు ప్రసంగంలో పర్యాటక రంగంలో సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహనతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను విద్యార్థులు అభివృద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, బీబీఏ విద్యార్థుల 'ది జర్నీ ఆఫ్ చేంజ్' స్కిట్, స్వాగత్ హోటల్ మేనేజ్‌మెంట్ అకాడమీ విద్యార్థుల ఫ్లెయిర్ బార్టెండింగ్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, మహారాజా కళాశాలలో నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.కార్యక్రమాన్ని డా. కుసుమ్ సమన్వయం చేయగా డా. దీపక్ త్రిపాఠి, కుమారి నిఖిత కార్యక్రమానికి మాస్టర్స్ ఆఫ్ సెరిమనీగా వ్యవహరించారు. ప్రొ. ఎం. శరత్‌చంద్ర బాబు, డా. శంకర్ రెడ్డి కొల్లె, డా. బి. కోటయ్య, డా. ఎన్.వి.ఎస్. సూర్యనారాయణ, డా. దివ్య, డా. వెంకటేశ్వర్లు, డా. నాగేష్ ఎం., డా. తారకేశ్వరరావు, మహారాజా కళాశాల మరియు సిటీయూ అధ్యాపకులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. మహారాజా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. ఎం. సాంబశివరావు కృతజ్ఞతలు తెలిపారు.

## 10 వేల మందికి పైగా వైసీపీ సభ్యులకు రూ.5 లక్షల ప్రమాద బీమా




**నర్సీపట్నం, పెన్ పవర్ (సెప్టెంబర్ 30) :** నర్సీపట్నం నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పార్టీ సభ్యత్వంతో పాటు రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పించే కార్యక్రమం చేపట్టినట్లు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేష్ తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ సభ్యత్వ కార్యక్రమం కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. తన ఆధ్వర్యంలో నర్సీపట్నం నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిపి 10 వేల మందికి పైగా పార్టీ సభ్యత్వాలు తీసుకున్నట్లు తెలిపారు. పార్టీ సభ్యత్వం పొందిన వారికి రూ.5 లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పించేందుకు పార్టీ నిర్ణయం తీసుకోవడం పట్ల ఉమాశంకర గణేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నర్సీపట్నం నియోజకవర్గం తరఫున మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచే విధంగా సభ్యత్వ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.

## గురుకుల పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి

**కమిటీ ఛైర్మన్ బొంగా రామకృష్ణకు జనసేన నేతల సూచన**



**నర్సీపట్నం, పెన్ పవర్ (సెప్టెంబర్ 30) :**గొలుగొండ బీఆర్. అంబేడ్కర్ గురుకుల పాఠశాల కమిటీ ఛైర్మన్‌గా జనసేన మద్దతుదారు బొంగా రామకృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం నర్సీపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర, జిల్లా కార్యదర్శి అల్లాడ సురేష్‌లను రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీరసూర్యచంద్ర, సురేష్ లు, రామకృష్ణ ను ఘనంగా సత్కరించారు. అనంతరం రాజాన వీరసూర్యచంద్ర మాట్లాడుతూ గురుకుల పాఠశాల అభివృద్ధికి కమిటీ ఛైర్మన్‌గా రామకృష్ణ ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు అందేలా పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.గురుకుల పాఠశాలలోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని, పాఠశాల అభివృద్ధిలో కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థుల ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని వీరసూర్యచంద్ర కోరారు.

## సేవా సంకల్ప్ అభియాన్‌లో ఉచిత వైద్య శిబిరం

**సీహెచ్‌సీలో మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించిన ప్రభుత్వ విప్ గణబాబు**






**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, సెప్టెంబర్ 30 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా చేపట్టిన 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా గోపాలపట్నం సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను పరిశీలించి, ప్రజలకు అందుతున్న సదుపాయాలపై వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, గర్భిణులతో గణబాబు నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత తదితర వివరాలను తెలుసుకున్నారు. పేదలు, సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు అవసరమైన మందులను ఉచితంగా అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులను ఆయన ఆదేశించారు. గణబాబు ప్రత్యేక కృషితో గోపాలపట్నం సీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన 'సదరం' క్యాంపును కూడా ఆయన పరిశీలించారు. దివ్యాంగులు ధ్రువీకరణ పత్రాల కోసం ఎలాంటి ఇబ్బందులు పడకుండా అవసరమైన ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అర్హులైన దివ్యాంగులకు ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందేలా సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేయడం, పేదలకు ఉచిత వైద్యం, మందులు అందించడం, దివ్యాంగులకు అవసరమైన ధ్రువీకరణ సేవలను సులభతరం చేయడం వంటి అంశాలపై ఈ కార్యక్రమంలో ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బందితో పాటు కూటమి నాయకులు దాడి వెంకట రమేష్, దాడి రమేష్ నాయుడు, నారిపిన్ని సత్తిరాజు, యలమంచిలి ప్రసాద్, కంపర ఆనంద్, నగులపల్లి లత, శరగడం అరుణ్ కుమార్, కవిత తదితరులు, కార్యకర్తలు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

# నాణ్యమైన రోడ్లు మెరుగైన మౌలిక వసతులే కూటమి ప్రభుత్వం లక్ష్యం.



పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు.

**పరవాడ: పెన్ పవర్: సెప్టెంబర్ 30:** నాణ్యమైన రోడ్లు మెరుగైన మౌలిక వసతులే ఎన్డీఏ కూటమి ప్రధాన లక్ష్యమని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పేర్కొన్నారు. బుధవారం గుంతలతో మృత్యుకుహరంగా మారిన అస్కపల్లి లంకెలపాలెం రోడ్డును ఆర్ అండ్ బి అధికారులు, స్థానిక ఎన్డీఏ నాయకులతో కలిసి పరిశీలించారు. భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు పూర్తిగా శిథిలమై ఉండటం పట్ల ఆవేదన వ్యక్తం చేసారు.అలాగే ఇటీవల లంకెల పాలెం బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడటంపైనా ఆంధోళన వెలిబుచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మీడియాతో మాట్లాడుతూ పైడివాడ అగ్రహారం నుండి పెదముసిడివాడ వరకు రోడ్డు నిర్మాణానికి 2. 5 కోట్లు, లంకెలపాలెం జంక్షన్ నుండి పరవాడ వరకు రోడ్డుకు 1.2 కోట్లు, లంకెలపాలెం ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై రోడ్డు పనులకు 39.90 లక్షలు నిధులు మంజూరైనాయని వెల్లడించారు. అయితే కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో రోడ్ల నిర్మాణ పనులు ఆలస్యమౌతున్నాయని అయినా సరే తక్షణమే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచిందని 16 లక్షల నిధులను వైద్యఖర్చులు కోసం లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసి ) కేటాయించిందని వెల్లడించారు. ఇంకా అవసరమైతే మరిన్ని నిధులు మంజూరు చేసి ఆకుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని స్పష్టం చేసారు. లంకెలపాలెం ఫ్లై ఓవర్ మరమ్మతు పనులను నెల రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రహదారులు భవనాల శాఖ ఉమ్మడి జిల్లా పర్యవేక్షణ ఇంజనీర్ (ఎస్ ఈ) కిట. జాన్ సుధాకర్ , కార్య నిర్వహణ అధికారి ( ఈ ఈ) కె.వి రంగయ్య , ఉప కార్యనిర్వాహణాధికారి ఎన్ నరసింహమూర్తి , సహాయక కార్యనిర్వాహన అధికారి (జేఈ) లలిత , బాలరాజు , పరవాడ సబ్బవరం మండలాల ఎంపీడీవోలు పద్మజా , మల్లికార్జున , మండల రెవెన్యూ అధికారులు రత్నం , అరుణ్ చంద్ర , సీనియర్ నాయకులు పంచకర్ల ప్రసాద్ రావు , కనీస వేతనాల డైరెక్టర్ బల్రెడ్డి అప్పారావు, మాజీ జెడ్పిటిసి సభ్యులు పైలా జగన్నాధ రావు ,మాజీ కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ,మండల పార్టీ అధ్యక్షులు బొద్దపు శ్రీనివాసరావు , కర్రీ కనకరాజు , మండల ఉపాధ్యక్షులు వర్రీ పరదేశి నాయుడు , ప్రధాన కార్యదర్శి ఏఎన్ఆర్ , బిజెపి నాయకులు పిల్లా సతీష్ ,మడక పార్వతి రమేష్ ,మాజీ ఎంపీటీసీ అప్పలరాజు , దుర్గి నాయుడు ,సీనియర్ నాయకులు ఇందల రమణ, దుళ్ళ రాము నాయుడు , బుగిడి రామ గోవింద , గొన్నా రమాదేవి , బలిరెడ్డి అప్పారావు , సుందరపు శ్రీనివాసరావు , దాసరి తాతారావు ,చలపాక రామారావు ,మోటూరు సన్యాసినాయుడు,కాకి బాబు , పిల్లా శివ కృష్ణ , మామిడి శంకర్రావు , బంతి కోళ్ల పద్మాగా,బొడ్డు ప్రకాష్ , గవర అప్పారావు , రోమాల చంద్రశేఖర్ ,చింతకాయల ముత్యాల , మడక రమణ , సింగంపిల్లి శ్రీనివాసరావు , సబ్బవరపు రవి ,విష్ణు కన్నా రావు ,నాగిరెడ్డి చిన్నారావు ,అర్జిల్లా అప్పలరాజు గల్లా శ్రీనివాసరావు ,వెలుగుల అనిల్ , సతివాడ సత్తిరాజు , పచ్చి కోర లక్ష్మీ , పావని తదితర రెండు మండలాల ఉమ్మడి కూటమి నాయకులు , కార్యకర్తలు మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంగన్వాడి సేవలను సద్వినియోగం చేసుకోండి...!

- కిసాన్ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రరావు,
- ఐసిడిఎస్ సూపర్వైజర్ రామలక్ష్మి



**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 30 :**పోషక విలువలతో కూడిన సంపూర్ణ పౌష్టికాహారం తల్లి బిడ్డల ఆరోగ్యానికి ఎంతోశ్రేయస్కరమని కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిబోయిన చక్రరావు, అంగన్వాడి సూపర్వైజర్ రామలక్ష్మి సూచించారు. మండలంలోని చింతలపూడి సెక్టార్ పరిధి మర్రివాడ అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడి ఉత్సవంలో భాగంగా సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడి సూపర్వైజర్ రామలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బిజెపి మండల ప్రధాన కార్యదర్శి, సేవా సంకల్ప అభియాన్ మండల ఇన్చార్జి పద్మరాజు (నాని ), కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రరావు (చిన్న), జిల్లా ఉపాధ్యక్షురాలు ఉష, బీసీ మోర్చా మండల అధ్యక్షుడు దేవుడు పాల్గొని అంగన్వాడీల ద్వారా అందుతున్న సేవలను వివరించారు. అంగన్వాడీలకు సరఫరా అవుతున్న సరుకుల నాణ్యతను పరిశీలించడంతోపాటు గర్భిణీలు బాలింతలు చిన్నారులకు అందాల్సిన పౌష్టికాహార కిట్లు సక్రమంగా అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేడి బోయిన చక్కరరావు మాట్లాడుతూ... రసాయనికి ఎరువుల ద్వారా పండించే పంటలకు ప్రత్యామ్నాయంగా సేంద్రీయ ఉత్పత్తులకు ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. చిరుధాన్యాలు ఆకుకూరల్లో ఉండే పోషక విలువలను వివరించారు. సర్వరోగ నివారణ అయిన మునగాకు పొడి కరివేపాకు పొడిలను వాడాలని తెలియజేశారు. గర్భిణీలు, బాలింతలు,చిన్నారులు సెల్ ఫోన్ కు దూరంగా ఉండటం మంచిదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. స్థానిక ఆరోగ్య ఉపకేంద్ర వైద్య సిబ్బంది రాజేశ్వరి గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. గర్భిణి కి ఘనంగా సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రివాడ, గుడ్లపల్లి, బూదరాళ్ల, దొడ్డవరం అంగన్వాడి కేంద్ర కార్యకర్తలు ఆయాలను నేతలు అధికారులు సాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ పరిధి పలు అంగన్వాడి కేంద్రాల సిబ్బంది, గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.

## వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో దీపావళి దీపాల పెయింటింగ్ కార్యక్రమం




**గాజువాక :పెన్ పవర్ ,సెప్టెంబర్ 30** విశాఖపట్నంలోని విప్రో క్యాంపస్లో విప్రో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పిరిట్ ఆఫ్ విప్రో రన్ 2026 కార్యక్రమంలో భాగంగా వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో దియా పెయింటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విప్రో సంస్థకు చెందిన 105 మంది ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని మట్టి ప్రమిదలకు వివిధ రంగులతో అందమైన పెయింటింగ్లు వేశారు.విప్రో ఫౌండేషన్ ప్రతినిధి అంతరా మాట్లాడుతూ, విప్రో వాలంటీర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉద్యోగుల సామాజిక బాధ్యత పట్ల ఉన్న నిబద్ధతకు ప్రతీక అన్నారు . సమాజంలోని అవసరమైన వర్గాలకు సహాయం చేయడంలో విప్రో ఉద్యోగులు ముందుండటం అభినందనీయమన్నారు.

వాసవ్య మహిళా మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ డా. ఎం. అబ్రహాం మాట్లాడుతూ, విప్రో ఉద్యోగులు ఎంతో ఉత్సాహంతో పెయింట్ చేసిన ఈ ప్రమిదలను రాబోయే దీపావళి పండుగ సందర్భంగా పేద మహిళలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పండుగ ఆనందాన్ని పేద మహిళలతో పంచుకోవడంతో పాటు, వారికి ఉపాధి మరియు ఆదాయానికి తోడ్పడే విధంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు .ఈ కార్యక్రమంలో కుషల్ కార్యక్రమం ప్రాజెక్ట్ ఆఫీసర్ వరలక్ష్మి, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు ఉష, భవాని, పార్వతి, శర్మిల, లక్ష్మి, కలావతి, కామాక్షి, అన్నయ్యబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో విప్రో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు.

## 2024 ఎన్నికల ముందు గిడ్డి ఈశ్వరి సమక్షంలోనే టిడిపిలో చేరాం...!

**అభివృద్ధి చేయకపోవడంతోనే వైసీపీలోకి చేరాం**



**కొయ్యూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 30:**గ్రామ అభివృద్ధి కోసమే పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సమక్షంలోనే 2024 ఎన్నికల ముందు తెలుగుదేశంపార్టీలో చేరామని బట్టుమట్ట గ్రామస్తులు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో దూరి రాజబాబు, పంగ్రా చిట్టిబాబు మాట్లాడుతూ... నడింపాలెం పంచాయతీ బట్టుమెట్ట గ్రామం అంత వైసీపీలోకి చేరడంతో కొంతమంది కూటమ నాయకులు తమ పార్టీకి చెందిన వారు కాదని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. 2024 ఎన్నికల కు 20 రోజులు ముందు ఈ ప్రాంతంలో ఉన్న టిడిపి నాయకులు దారకొండ నారాయణమూర్తి, సుమ్మర్ల సాంబశివరావు, పనసల రాము ఆధ్వర్యంలోనే అప్పట్లో గిడ్డి ఈశ్వరి సమక్షంలో టిడిపిలో చేరామని తెలిపారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు అవుతున్న తమ గ్రామం అభివృద్ధి పై ఏటువంటి స్పందన లేదని అందుకే తమకి ఇష్టమైన వైఎస్ఆర్సిపి లోకి చేరడం జరిగిందని స్పష్టం చేశారు. వాస్తవాలను వక్రీకరించి కూటమి నాయకులు ప్రచారాలు చేస్తున్నారని దమ్ముంటే తమ గ్రామానికి వచ్చి టిడిపి నుండి వైఎస్సార్సీపీలోకి వెళ్లలేదని చెప్పగలరా అని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా అసత్య ప్రచారాలు చేయవద్దని హితవు పలికారు.

## రాజేంద్రపాలెం పి హెచ్ సి ని అడిషనల్ డి ఎం అండ్ హెచ్ ఓ ఆకస్మిక తనిఖీ.

**పాడేరు అడిషనల్ డి ఎం అండ్ హెచ్ ఓ ప్రతాప్.**



**కొయ్యూరు,పెన్ పవర్ సెప్టెంబర్ 30:** కొయ్యూరు మండల కేంద్రంలో ఉన్న రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేందాన్ని పాడేరు అడిషనల్ డి ఎం అండ్ హెచ్ ఓ ప్రతాప్ ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ మేరకు బుధవారం ఇక్కడ పి హెచ్ సి లో రోగుల ఆరోగ్య పరిస్థితి పై పరిశీలించిన ఆయన పేషెంట్స్ ను వైద్యం అందే విధానం ను నేరుగా అడిగి తెలుసుకున్నారు.గర్భిణి స్త్రీలకు రోజు వారికి అందించే సేవలపై అడిషనల్ డి ఎం అండ్ హెచ్ ఓ అడిగి తెలుసుకున్నారు.104 సేవలను ఏ విధంగా సర్వీస్ చేస్తున్నది ఆరా తీశారు.అనంతరం డాక్టర్ జగదీష్ నాయక్ కు సూచనలు చేశారు. పిహెచ్ సి లో రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పేషెంట్ ను ఎప్పటికప్పుడు విధిగా తనిఖీలు చేపట్టి వ్యాధుల నివారణ పట్ల చర్యలను తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ జగదీష్ నాయక్, సి హెచ్ ఓ ప్రశాంత్ కుమార్, ఆర్ బి ఎస్ కే కోఆర్డినేటర్ కిషోర్ కుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మండల పరిషత్ పాలకవర్గానికి వీడ్కోలు ఆత్మీయ సత్కారం



**కొయ్యూరు,పెన్ పవర్ సెప్టెంబర్ 30:** గత ఐదేళ్ల పాలనలో అధికార్లు, పాలక వర్గ సభ్యుల సంపూర్ణ సహకారంతో పాటు ప్రజల అభిమానం పాత్రికేయుల ప్రోత్సాహంతో మండలంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టమని మీ అందరి ఆత్మీయ ఆదారాభి మానాన్ని మరువలేనిదని మండలాధ్యాక్షులు బడుగు రమేష్ బాబు అన్నారు. కొయ్యూరు మండల పరిషత్ పాలక వర్గం వీడ్కోలు ఆత్మీయ సమావేశ కార్యక్రమం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రమేష్ బాబు ను మండల స్పెషల్ ఆఫీసర్ పి ఎస్ కుమార్, ఎంపీడీవో ప్రసాద్, పరిపాలన అధికారి బాల మురళీకృష్ణ డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల ఇంజినీరింగ్ అధికారి రామకృష్ణ, ఏ టి డబ్ల్యూ ఓ క్రాంతి కుమార్, ఇక్కడ గతంలో పనిచేసిన ఎంపీడీవో లాలం సీతయ్య, పి ఎస్ ప్రసాద్ తదితరులు ఎంపీపీ రమేష్ బాబు ను దూశాలువ కప్పి పుష్పగుచాలిచ్చి ఘనంగా సన్మానం చేశారు.అలాగే వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ, నుకాలమ్మ లతో పాటు ఎంపీటీసీలను మండల అధికార్లు సన్మానం చేశారు. ఈ వీడ్కోలు ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో మాజీఎంపిపి రమేష్ బాబు మాట్లాడుతూ... ప్రజా సమస్యలను పరిష్కరించటంలో వారి పట్ల పట్టించుకుని పరిష్కారానికి ప్రజల కోసం పోరాడితే అలాంటి నాయకులకు ఎక్కరికైనా ఓటమి అనేదే ఉండదని ఆ దిశగా మనం పని చేస్తేనే గుర్తింపు ఉంటుందని మాజీ ఎంపీపీ అన్నారు. తాను ఎంపీటీసీ గా పోటీ చేసిన సెగ్మెట్లో రేవళ్ళు, మంప తదితర గ్రామాల ప్రజలు తనను ఏంతగానో ఆదరించి కేవలం వ్యక్తిగత అభిమానంతోనే పార్టీలకతీతంగా వెన్నంట దన్నుగా ఉండి గెలిపించారని ఆయా గ్రామాల ప్రజలు అందరికి పేరు పేరున రుణపడి ఉంటానని ఈ ఆత్మీయ వీడ్కోలు సన్మాన సభలో ఎంపీపీ రమేష్ బాబు అన్నారు ఐదేళ్ల పాలనలో ప్రజలకు అందుబాటులో ఉంటూ అందరితో కలిసి పని చేయటం ఎంతో తృప్తి నిచ్చినట్టు తెలిపారు. ప్రజలకు అందించిన సేవలను అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు తనకు ఎంతో తృప్తి నిచ్చినట్టు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, మాజీ ఎంపీటీసీ, సర్పంచ్ లతో పాటు ఎంపీపీ రమేష్ బాబు హయంలో తమ అందరితో కలసి పనిచేసే విధానాన్ని అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రశంసించారు. ఉద్యోగరీత్యా చేపట్టే విధుల్లో సిబ్బంది పట్ల ఎంపీపీ రమేష్ బాబు ఐదేళ్ల పదవి కాలంలో అందరితో స్నేహపూర్వకంగానే కలిసి మెలసి పాలన సాగించారని ఏ ఒక్కరినీ ఏనాడు ఏమి అనలేదని తామందరిని కుటుంబ సభ్యులుగానే భావిస్తూ ఇష్టపూర్వకంగానే చూశారు తప్పా.. ఎంపీపీ అనే భావనతో గానీ ,పదవి పాలన చేయలేదని ఎంపీడీవో జీవిడి ప్రసాద్, పరిపాలన అధికారి బాల మురళీకృష్ణ, మండల ఇంజినీరింగ్ అధికారి రామకృష్ణ లతో పాటు గతంలో ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో లాలం సీతయ్య, పి ఎస్ ప్రసాద్ లు కొనియాడారు. ఈ ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో మండలస్పెషల్ ఆఫీసర్ పి ఎస్ కుమార్, ఎంపీడీవో ప్రసాద్, సీతయ్య, పి ఎస్ ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ లు అప్పన వెంకటరమణ, నుకాలమ్మ, బిడిజన అప్పారావు, తదితర ఎంపీటీసీ లు, సర్పంచ్ లు మండల కార్యదర్శిలు, తదితరులు పాల్గొన్నారు.

## మెగా రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించిన విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చి




**గాజువాక:పెన్ పవర్,సెప్టెంబర్30** రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలనే లక్ష్యంతో టీడీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా రక్తదాన శిబిరానికి విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి ప్రోత్సాహాన్ని అందించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత రెండేళ్లుగా నిర్వహిస్తున్న మెగా రక్తదాన శిబిరం పోస్టర్‌ను సీపీ శంఖబ్రత బాగ్చి వరుసగా ఆవిష్కరిస్తూ వస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది అక్టోబర్ 4వ తేదీన గాజువాక బీసీ రోడ్ వద్ద నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రక్తదానం వంటి సామాజిక సేవా కార్యక్రమాలను ప్రోత్సహించడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి ఎంతో ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు.విశాఖపట్నం నగరంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి గారికి ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు, వారికి సులభంగా పోలీస్ సేవలు అందేలా ఆయన తీసుకుంటున్న చర్యలు కూడా విశాఖ నగర పోలీసింగ్‌లో ప్రజా సంబంధాలను మరింత బలోపేతం చేస్తున్నాయి.ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, గత రెండేళ్లుగా తమ మెగా రక్తదాన శిబిరానికి సీపీ అందిస్తున్న ప్రోత్సాహం తమకు ఎంతో స్ఫూర్తినిస్తోందన్నారు. 2026 అక్టోబర్ 4న జరిగే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయడానికి యువత, రక్తదాతలు, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రజలు సహకరించాలని కోరారు.ఒక్క యూనిట్ రక్తం -- ఒక ప్రాణానికి ఆశ . రక్తదానం చేయండి ప్రాణదాతలుగా నిలవండి పిలుపునిచ్చారు .

## ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు ఘన సత్కారం.. రిటైర్డ్ ఉపాధ్యాయుడు మోహన్రావు

వైఎస్సార్‌సీపీలోకి రిటైర్డ్ ఉపాధ్యాయుడు మోహన్రావు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 30:** వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై రిటైర్డ్ ఉపాధ్యాయుడు కంకీపాటి మోహన్రావు వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు సమక్షంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న మోహన్రావు, తనను వైఎస్సార్ కుటుంబ సభ్యుడిగా ఆదరించి పార్టీలోకి ఆహ్వానించినందుకు కృతజ్ఞతగా ఎమ్మెల్యేను దుస్సాలువాతో ఘనంగా సత్కరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి, పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని మోహన్రావు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# మాటలకు కాదు.. ప్రజల తీర్పుకే విలువ!



- దామనపల్లిలో జనసేన ఘాటు ప్రకటన
- చేరికలపై విమర్శలకు జనసేన నేతల కౌంటర్..
- స్థానిక ఎన్నికలే లక్ష్యం.. సర్పంచ్, ఎంపీటీసీ విజయానికి సమష్టి కృషి

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 30:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం దామనపల్లిలో జనసేన పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆ పార్టీ నాయకులు, జనసైనికులు తెలిపారు. ఇటీవల పార్టీలో జరిగిన చేరికలపై మాజీ సర్పంచ్ కుందేరి రామకృష్ణ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో జనసేన నాయకులు స్పందిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**ప్రజల సమక్షంలో జరిగిన చేరికలపై వక్రీకరణ సరికాదు:**

పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు తమ స్వచ్ఛంద నిర్ణయంతోనే జనసేనలో చేరారని నాయకులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ తమకు నచ్చిన రాజకీయ పార్టీని ఎంచుకునే హక్కు ఉందని, వారి రాజకీయ నిర్ణయాలను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సమక్షంలో జరిగిన రాజకీయ పరిణామాలపై వాస్తవాలను వక్రీకరించేలా వ్యాఖ్యానించడం సమంజసం కాదని పేర్కొన్నారు.

**వ్యక్తిగత విమర్శలు వద్దు.. ప్రజలే అంతిమ నిర్ణేతలు**

రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమే అయినప్పటికీ అవి వ్యక్తిగత అంశాలకు దారితీయకూడదని జనసేన నాయకులు అన్నారు. కుటుంబ, వ్యక్తిగత సంబంధాలను రాజకీయ నిర్ణయాలతో ముడిపెట్టి వ్యాఖ్యానించడం తగదని పేర్కొన్నారు. ఎవరు ఏ పార్టీకి మద్దతు ఇవ్వాలనే విషయాన్ని నిర్ణయించేది ప్రజలేనని, చివరకు ప్రజల తీర్పే రాజకీయ భవిష్యత్తును నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు.

**స్థానిక ఎన్నికలే టార్గెట్**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని దామనపల్లిలో పార్టీని మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించామని జనసేన నాయకులు తెలిపారు. సర్పంచ్, ఎంపీటీసీ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తారని పేర్కొన్నారు. యువత, మహిళలు, గ్రామ పెద్దలు, జనసైనికులను కలుపుకుని పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతం చేస్తామని తెలిపారు.

**మాటలతో కాదు.. ప్రజల మద్దతుతోనే సమాధానం:**

ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జనసేన నాయకులు తెలిపారు. రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, మౌలిక వసతుల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాజకీయ విమర్శలకు మాటలతో సమాధానం ఇవ్వడం కంటే ప్రజల్లో తమకు లభించే మద్దతే సమాధానమని నాయకులు పేర్కొన్నారు. "గ్రామ అభివృద్ధి, ప్రజాసేవే మా ప్రాధాన్యత. రాబోయే స్థానిక ఎన్నికల్లో జనసేన అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేస్తాం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇటీవలె జనసేన పార్టీలో చేరిన గ్రామ పెద్ద గ్రామ మునసాబు కుందేరి నాగరాజు, జనసేన పార్టీ పంచాయతీ అధ్యక్షులు మాదల సతీష్, సీదారి రమణమూర్తి, పాంగి దారబాబు, వంతల వెంకటేశ్వర్లు, కూడ మహేష్, వంతల సింగరాజు, పోటుకూరి మహేష్, సెర్రేకి సతీష్, కుందరి శేఖర్, గ్రామ పెద్దలు కుందరి నాగరాజు,మాదల కనకరాజు, కూడ చంటిబాబు, కూడ పల్లంనాయుడు, జనసేన వీరమహిళలు సెర్రేకి లోవకుమారి,మాదల సత్యవతి, విడవారి కావ్య, లీలావతి, విడవారి దేవి తదితరులు పాల్గొన్నారు.

# "గూడెంకొత్తవీధిలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల శంఖారావం"



**కార్యకర్తలు ధైర్యంగా పోటీ చేయండి.. మీ వెంటే నేను ఉంటా**

**ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు**

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 30:**రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను క్షేత్రస్థాయి నుంచి సన్నద్ధం చేయాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు పిలుపునిచ్చారు. గూడెంకొత్తవీధి మండల కేంద్రంలోని కళ్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ, పార్టీ కష్టకాలంలో జెండాను మోసిన ప్రతి కార్యకర్తను వైఎస్సార్‌సీపీ ఎప్పటికీ మరచిపోదన్నారు. కార్యకర్తలు ధైర్యంగా ఎన్నికల్లో పోటీ చేయాలని, వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి గ్రామంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు, పాలనలోని వైఫల్యాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రజలు కేవలం మాటలను కాకుండా అభివృద్ధిని కోరుకుంటున్నారని, అభివృద్ధిని చేతల్లో చూపించాల్సిన అవసరం ఉందన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తవుతున్నా గూడెంకొత్తవీధి మండలానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎన్ని నిధులు తీసుకొచ్చారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. అధికారం శాశ్వతం కాదని, అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు ప్రజలపై నమ్మకం కోల్పోయారని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజల మద్దతుతో ఎన్నికలను ఎదుర్కొనే బదులు పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని ఎన్నికలను నిర్వహించాలని చూస్తున్నారని ఆరోపించారు."మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను అగ్రస్థానంలో కూర్చోబెట్టే బాధ్యత నాది. కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుంది" అని ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు అన్నారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికీ పార్టీ గుర్తింపు కార్డులు అందజేస్తామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో గూడెంకొత్తవీధి మండల మాజీ ఎంపీపీ బోయిన కుమారి, మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్,రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, మండల ఉపాధ్యక్షుడు వంతల అరుణ్‌కుమార్, జిల్లా క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు వసపరి తిమోతి (పాస్టర్), మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కుందెం రామకృష్ణ, పాడేరు నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు కంకిపాటి రామారావు, మాజీ జెడ్పీటీసీ మచ్చల మచ్చ రాజు, వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, వైసీపీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు కంకిపాటి నారాయణరావుతో పాటు వివిధ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం




**గాజువాక :పెన్ పవర్,సెప్టెంబర్ 30 :**స్థానిక గాజుడిగ్రీ కళాశాలలోవాక ఆదిత్య డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకంలో భాగంగా ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో వందేభారత్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి, బ్లడ్ మోటివేటర్ వి. వినోద్ బాలు సౌజన్యంతో గురువారం మెగా రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదిత్య నార్త్ ఆంధ్ర రీజినల్ మేనేజర్ ఎన్. రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ రక్తదాన శిబిరంలో 163 యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించారు. ఈ శిబిరంలో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు అధిక సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్స్ పి. ప్రదీప్ కుమార్ మరియు ఎం. సత్యప్రకాశ్ గార్లు మాట్లాడుతూ, ఆదిత్య కళాశాలలో విద్యతో పాటు మానవతా విలువలు, సామాజిక సేవ విద్యార్థులకు అలవడేలా బోధన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం అన్నిటికన్నా ఉత్తమమైనదని, రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఇది ఉత్తమమైన దేశసేవ అని మరియు అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని అభివర్ణించారు. ప్రతి ఒక్కదానికి ప్రత్యామ్నాయం ఉందని, ఒక్క రక్తానికి మాత్రమే ప్రత్యామ్నాయం లేదని, రక్తదానం చేయడం ఒక్కటే పరిష్కార మార్గమని అన్నారు.రక్తం కొరత సమస్యను అధిగమించేందుకు తమ వంతుగా కళాశాలలో సంవత్సరానికి కనీసం రెండుసార్లు రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాలు చేయడంలో ముందుండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులను , అధ్యాపకులకు కళాశాల యాజమాన్యం ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించింది.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ ఆర్.వి.ఆర్. పాత్రుడు , బి.వి.వి. నరసింహమూర్తి , ఎన్.ఎస్.ఎస్ పి.ఓలు బి. తిరుపతిరావు, కె. శివకృష్ణ, కె. సన్యాసిరావు , అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.ద

## వెలగలపాలెం రైతులకు రాజ్మా విత్తనాలు పంపిణీ.




**కొయ్యూరు,పెన్ పవర్ సెప్టెంబర్ 30:** ఆదివాసీ గ్రామాల్లో ప్రభుత్వం సరఫరా చేస్తున్న రాజ్మా విత్తనాలతో దిగుబడి సాధించే విధంగా రైతులు కృషి చేసి ఆర్థికంగా ఎదగాలని వెలగలపాలెం పంచాయితీ టీడీపీ ఇంచార్జి ఇడవాడ సత్యనారాయణ అన్నారు.మండలంలోని శరభన్నపాలెం ఆర్ బి కె భవనంలో బుధవారం ఏ ఓ శివరామ ప్రసాద్, మాజీ సర్పంచ్ నారాయణమూర్తి,వెలగలపాలెం పంచాయితీ టీడీపీ ఇంచార్జి ఇడవాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాలకు చెందిన పలువురు రైతులకు రాజ్మా విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం ఏ ఓ శివరామ ప్రసాద్ రైతులకు సాగుపై మెళుకువలను రైతులకు అవగాహన కల్పించారు. ఏ విధంగా పనిచేయాలనేది వీడియో ప్రదర్శన ద్వారా కుసుమ సాగు విధానం చూపించారు. ఆసక్తి గల రైతులు సంబధిత రైతు సేవా కేంద్రం నందు సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వేరుసెనగ,మినుము సీడ్ కావలసిన రైతులు సమీప రైతు సేవా కేంద్రం లో పొందాలని ఏ ఓ శివరామ ప్రసాద్ తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గొడ్డేటి మహేష్, త్రిమూర్తులు, కొండబాబు, మంగదేవి, వెంకటేశ్వర్లు, కితాబు, సరమండ,దద్దుగుల రైతులు పాల్గొన్నారు.

## శ్రమదానంతో కొత్తవాడలో కల్వర్టు పునరుద్ధరణ

అధికారుల కోసం ఎదురుచూడలేదు.. గ్రామస్థులే రంగంలోకి!




**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 30:**ఇటీవల కురిసిన భారీ వర్షాలు, తుఫాను ప్రభావంతో కొట్టుకుపోయిన కల్వర్టుకు గ్రామస్థులే స్వచ్ఛందంగా తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించారు. గూడెంకొత్తవీధి మండలం మొండిగెడ్డ పంచాయతీ పరిధిలోని కొత్తవాడ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది.భారీ వర్షాలకు కల్వర్టు కొట్టుకుపోవడంతో గ్రామస్థులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తక్షణ పరిష్కారం లభించకపోవడంతో గ్రామస్థులే ముందుకు వచ్చారు.గ్రామ ప్రజల ఇబ్బందులను గుర్తించిన కొత్తవాడ మాజీ సర్పంచ్ ప్రియాంక, గిరిజన సహకార సంస్థ ఉద్యోగి (సేల్స్‌మెన్) హరిబాబు తమ వంతు సహకారం అందించేందుకు ముందుకు వచ్చారు. తమ సొంత నిధులతో ఆర్థిక సాయం అందించడంతో పాటు గ్రామస్థులను సమీకరించి కల్వర్టు మరమ్మతు పనులు చేపట్టేందుకు చొరవ చూపారు.వారి పిలుపుతో గ్రామస్థులంతా ఏకమై శ్రమదానం చేశారు. కల్వర్టుకు అవసరమైన తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేసి రాకపోకలకు వీలు కల్పించారు. దీంతో వర్షాల కారణంగా నిలిచిపోయిన గ్రామ రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి.కష్టకాలంలో గ్రామ ప్రజల ఇబ్బందులను గుర్తించి ఆర్థికంగా, ఇతర విధాలుగా అండగా నిలిచిన మాజీ సర్పంచ్ ప్రియాంక, హరిబాబులకు కొత్తవాడ గ్రామ ప్రజలు, పంచాయతీ వాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సమస్య పరిష్కారానికి ప్రభుత్వ సహాయం అందేవరకు ఈ తాత్కాలిక మరమ్మతులు ఉపశమనం కలిగిస్తాయని గ్రామస్థులు పేర్కొన్నారు.

# టీడీపీలోకి శెట్టి వెంకట్రావు కుటుంబం.

**చంద్రబాబు సంక్షేమ పథకాలు, దొన్నుదొర నాయకత్వం ఆకర్షించాయని వెల్లడి.**



**అరకులోయ పెన్ పవర్ సెప్టెంబర్ 30** :అరకు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోకి వరుస చేరికలు కొనసాగుతున్నాయి. అరకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్మన్ సియారి దొన్నుదొర ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ శెట్టి వెంకట్రావు కుటుంబం టీడీపీలో చేరింది.శెట్టి వెంకట్రావుతో పాటు మాజీ ఎంపీటీసీ సభ్యురాలు శెట్టిబుట్టి, వారి కుమారుడు శెట్టి అశోక్‌కుమార్ టీడీపీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు తెలిపారు. అరకు నియోజకవర్గంలో సియారి దొన్నుదొర ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తీరు కూడా తమను ప్రభావితం చేసిందని పేర్కొన్నారు.శెట్టి అశోక్‌కుమార్ చొరవతో వివిధ గ్రామాలకు చెందిన సుమారు 30 మంది నాయకులు, కార్యకర్తలు కూడా టీడీపీలో చేరినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. లోతేరు మాజీ ఉపసర్పంచ్ శెట్టిగెను, శెట్టి మధు, బస్కి గ్రామానికి చెందిన పాంగి ప్రదీప్, మాజీ వార్డు సభ్యుడు నన్ని అప్పలరాజు, అనంతగిరి మండలం వాలసీకి చెందిన బాక నరసింగరావు, హుకుంపేట మండలానికి చెందిన వార్డు సభ్యురాలు చట్టు కన్నమ్మ తదితరులు పార్టీలో చేరారు.పద్మాపురం పంచాయతీ నుంచి కిల్లో మహేష్, పొట్టంగి కుమార్, కిల్లో భీమరాజు, వంతల మహేష్ తదితరులు కూడా టీడీపీ కండువాలు కప్పుకున్నారు.

## డిజిటల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, టెక్నాలజీ ఇంటిగ్రేషన్‌పై వీఐటీలో అవగాహన కార్యక్రమం



**కూర్మన్న పాలెం:పెన్ పవర్ ,సెప్టెంబర్30** విజ్ఞాన్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ లో డిజిటల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ టెక్నాలజీ ఇంటిగ్రేషన్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ సొసైటీ, విశాఖపట్నం వ్యవస్థాపకురాలు వఫీరా జొన్నాడ రిసోర్స్ పర్సన్‌గా హాజరయ్యారు. విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి డిజిటల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, టెక్నాలజీ ఇంటిగ్రేషన్, సాంకేతికత ఆధారిత ఆవిష్కరణల్లో ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించారు.
డిజిటల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో భాగంగా నిజ జీవిత సమస్యలను గుర్తించి, డిజిటల్ టెక్నాలజీలను ఉపయోగించి ఉత్పత్తులు, సేవలు లేదా వ్యాపార నమూనాలను అభివృద్ధి చేయడం గురించి వివరించారు. కేవలం అప్లికేషన్లను రూపొందించడం కాకుండా, ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను గుర్తించి వాటికి సమర్థవంతమైన పరిష్కారాలను అభివృద్ధి చేయాలని విద్యార్థులకు సూచించారు.మార్కెటింగ్, సేల్స్, ఆపరేషన్స్, కస్టమర్ సర్వీస్, ఫైనాన్స్, నిర్ణయాలు తీసుకోవడం వంటి వివిధ వ్యాపార కార్యకలాపాల్లో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. సోషల్ మీడియా, ఈ-కామర్స్ ప్లాట్‌ఫార్మ్‌లు, క్లౌడ్ ఆధారిత సాఫ్ట్‌వేర్, ఆన్‌లైన్ పేమెంట్ సిస్టమ్స్, డేటా అనలిటిక్స్, ఆటోమేషన్ వంటి డిజిటల్ సాధనాల ద్వారా వ్యాపారాల పరిధిని విస్తరించడం, సామర్థ్యాన్ని పెంచడం, కస్టమర్లతో మెరుగైన అనుసంధానాన్ని సాధించడం వంటి అంశాలను వివరించారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను వ్యాపార సహాయక సాధనంగా ఉపయోగించుకోవచ్చని పేర్కొంటూ మార్కెట్ రీసెర్చ్, కంటెంట్ క్రియేషన్, డేటా అనాలిసిస్, కోడింగ్, కస్టమర్ సపోర్ట్, కొత్త ఆలోచనల రూపకల్పన వంటి కార్యకలాపాల్లో ఏఐ వినియోగాన్ని వివరించారు.విద్యార్థులు తమ డిజిటల్ మరియు ప్రొఫెషనల్ ఐడెంటిటీని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పోర్ట్‌ఫోలియోలు, ప్రాజెక్టులు, సర్టిఫికేషన్లు, లింక్డ్‌ఇన్ వంటి ప్రొఫెషనల్ ప్లాట్‌ఫార్మ్‌లను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. డిజిటల్ ఎకానమీలో ఉద్భవిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన సాంకేతిక, వృత్తిపరమైన, ఎంటర్‌ప్రెన్యూరియల్ నైపుణ్యాలపై విద్యార్థులకు కార్యక్రమం ద్వారా ప్రాక్టికల్ అవగాహన కలిపించారు . ఈ సందర్భంగా డా. జె. సుధాకర్, ప్రిన్సిపాల్; డా. వి. మధుసూదన రావు, రెక్టర్; డా. టి.వి. మధుసూదన రావు, ఏఐ అండ్ డీఎస్ విభాగాధిపతి; డా. జి. నీలిమ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాధిపతి కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. విద్యార్థులకు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలపై అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాన్ని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జి. జ్యోతి, ఏఐ అండ్ డీఎస్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ బి. మాధవి, ఏఐ అండ్ డీఎస్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. పి. విశ్వేశ్వర రావు సమన్వయం చేశారు.

## ఆశ్రమ పాఠశాలలో 'మిషన్ మార్చి' కార్యాచరణ అమలు చేయాలి



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 30**: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 'మిషన్ మార్చి' కార్యాచరణను తప్పక అమలు చేయాలని జీకేవీధి ఏటీడబ్ల్యూఓ జయనాగలక్ష్మి సూచించారు. బుధవారం మండలంలోని పెదవలస బాలుర ఆశ్రమ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించి, మెనూ అమలు తీరును తనిఖీ చేశారు.పదో తరగతి విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలకు సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.ద

## రంపులలో స్వచ్ఛపదం కార్యక్రమం




**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 30**: పెదవలస గ్రామపంచాయతీ పరిధిలోని రంపుల గ్రామంలో బుధవారం స్వచ్ఛపదం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న బిన్--బ్యాగ్ సిస్టంపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.ఇంట్లో ఉత్పత్తయ్యే తడి చెత్తను బిన్‌లో వేసి ప్రతిరోజూ హరిత రాయబారులకు అందించాలని సూచించారు. పొడి చెత్తలోని ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువులు, ఇనుప సామగ్రిని బ్యాగ్‌లో సేకరించి, గ్రామానికి స్వచ్ఛరథం వచ్చినప్పుడు అందజేయాలని వివరించారు. వీటి ద్వారా వచ్చే మొత్తాన్ని నగదు రూపంలో లేదా అవసరమైన సామగ్రి రూపంలో పొందవచ్చని తెలిపారు.కార్యక్రమంలో ఎంపీడీఓ బిహెచ్వి రమణబాబు, డిప్యూటీ ఎంపీడీఓ జగదీష్, పంచాయతీ కార్యదర్శి కిట్లంగి బాలకృష్ణ,పీసా సభ్యులు దొరబాబు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవీ అవగాహనకు రెడ్ రిబ్బన్ 5కే మారథాన్




**స్టాఫ్ రిపోర్టర్ పాడేరు, పెన్ పవర్, సెప్టెంబర్ 30:** యువతలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానంపై చైతన్యం తీసుకురావాలనే లక్ష్యంతో బుధవారం పాడేరులో రెడ్ రిబ్బన్ 5కే మారథాన్ నిర్వహించారు. ఇంటర్నేషనల్ యూత్ ఫెస్ట్--2026లో భాగంగా ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి హుకుంపేట మండలం బర్మంగూడ వరకు ఈ పరుగు సాగింది.మారథాన్‌లో 17 నుంచి 25 ఏళ్ల యువతీ యువకులు, కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. హెచ్ఐవీ నివారణ, పరీక్షల ప్రాధాన్యత, అపోహలు--వివక్ష నిర్మూలనపై అవగాహన కల్పించారు.బాలుర విభాగంలో అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి సీతం, ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి సాయికుమార్ వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. బాలికల విభాగంలో అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎస్. మంజుల, పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎస్. మధు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. విజేతలకు జిల్లా కలెక్టర్ టి. నిషాంతి నగదు బహుమతులు అందజేశారు.చెప్పులు లేకుండానే పరుగెత్తి ద్వితీయ బహుమతి సాధించిన ఎస్. మధు పరిస్థితిని గమనించిన కలెక్టర్, ఆమెకు షూస్ అందించి ప్రోత్సహించారు. యువత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రజారోగ్య అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి ఎస్. కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లె పండుగ 3.0లో అభివృద్ధికి మరో అడుగు......



- మూడు గ్రామాల్లో రూ.60 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన.....
- నాతవరం మండలానికి 143 పనులు.....
- రూ.21 కోట్ల నిధులు....
- తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ వెల్లడి.....

**నాతవరం,పెన్ పవర్ (సెప్టెంబర్ 30):**గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ పేర్కొన్నారు.పల్లె పండుగ 3.0లో భాగంగా నాతవరం మండలంలోని పలు గ్రామాల్లో సుమారు రూ. 60 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు.పెద గొలుగొండపేట, పెద్ద జగ్గంపేట, పీకే గూడెం గ్రామాల్లో చేపట్టనున్న రోడ్ల నిర్మాణ పనులకు తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా కరక సత్యనారాయణ మాట్లాడుతూ.. పల్లె పండుగ 3.0లో భాగంగా నాతవరం మండలానికి మొత్తం 143 అభివృద్ధి పనులు మంజూరు కాగా, వాటికి సుమారు రూ.21 కోట్ల నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే మండలంలోని అనేక గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయని, మిగిలిన అభివృద్ధి పనులను కూడా వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.గ్రామాల్లో మెరుగైన రహదారులు, మౌలిక వసతులు కల్పించడం ద్వారా ప్రజలకు మరింత సౌకర్యవంతమైన జీవన వాతావరణాన్ని అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం సత్య శ్రీనివాస్,ఉపాధి హామీ ఏపీఓ కొండాజి, టిడిపి యువ నేత గొంప చిట్టిబాబు, టిడిపి సీనియర్ నాయకులు లగుడు వెంకటరమణ,భాస్కరరావు,గోవిందు, పీకే గూడెం వెంకటరమణ తదితరులతో పాటు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన




**ఆనందపురం, పెన్ పవర్,సెప్టెంబరు 30:**ఆనందపురం డీసీసీబీ బ్యాంకులో నాబార్డ్ ఎఫ్ఐఎఫ్ సౌజన్యంతో బుధవారం ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి (డీడీఎం) సమంత్ కుమార్ పాల్గొని మాట్లాడారు. బ్యాంకింగ్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. డిజిటల్ లావాదేవీల్లో మోసాలు జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రైతుల కోసం అందుబాటులో ఉన్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.డీసీసీబీ బ్యాంకు మేనేజర్ ఏ.ఎస్.వి.ఎస్. నాగలక్ష్మి మాట్లాడుతూ బ్యాంకులో బంగారం, వ్యవసాయ, వ్యాపార రుణాలతో పాటు వివిధ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డిజిటల్ లావాదేవీలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు.
వేములవలస పీఏసీఎస్ ఇన్‌చార్జి రౌతు నాగరాజు మాట్లాడుతూ రైతులకు ఎకరాకు సుమారు ఆరు లక్షల వరకు మార్టేజ్ రుణ సదుపాయం కల్పించినప్పటికీ ఆనందపురం మండలంలో మార్కెట్ వ్యాల్యూ అదనంగా ఉండటం వల్ల రుణాలు పెంచాలని కోరారు. పీఏసీఎస్ నాయకులు నారాయణరావు మాట్లాడుతూ కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా సహకార సంఘాల ద్వారా రైతులకు రుణాలు అందించేందుకు మరింత వెసులుబాటు కల్పించాలని కోరారు.కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం సమంత్ కుమార్, బ్యాంకు మేనేజర్ ఏ.ఎస్.వి.ఎస్. నాగలక్ష్మి, ఫీల్డ్ ఆఫీసర్ పి. శ్రీను, క్యాషియర్ సంతోషి, ఆనందపురం, వేములవలస, సొంత్యం పీఏసీఎస్‌ల సీఈవోలు నారాయణరావు, దశావతారం, జయరావు తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 30:** వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఏపీఈపీడీసీఎల్ జీకేవీధి ఏఈఈ సూరిబాబు తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మరమ్మతులకు గురైన 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి, బుధవారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.విద్యుత్ లైన్లలో లోపాలను ఎప్పటికప్పుడు గుర్తించి, సిబ్బందిని అప్రమత్తం చేస్తూ మరమ్మతులు చేపడుతున్నామని ఏఈఈ తెలిపారు. వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

## వడ్లపూడి బస్ స్టాప్ ను పర్మినెంట్ బస్ స్టాప్ చేయండి




**కూర్మన్న పాలెం :పెన్ పవర్ ,సెప్టెంబర్ 30** మహా విశాఖ నగర పాలక సంస్థ 87వ వార్డు పరిధి వడ్డపూడి బస్ స్టాప్ ను పర్మినెంట్ బస్ స్టాప్ చేయాలని కూర్మన్నపాలెం డిపో మేనేజర్ ను మాజీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం కోరారు . వడ్లపూడిలో సుమారు 28వేల జనాభా జీవనం సాగిస్తున్నారని . ప్రతి రోజు విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు వారి గమ్యస్థానాలకు చేరేందుకు ఈ ఆర్టీసీ బస్సులను వినియోగిస్తున్నారని, ఈ వడ్లపూడి బస్ స్టాప్ రిక్వెస్ట్ బస్టాప్ అయినందున ఈ బస్టాప్ లో అన్ని బస్సులు ఆగకపోవడం వల్ల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారుని వారిని దృష్టిలో పెట్టుకొని వడ్లపూడి బస్టాప్ ను పర్మినెంట్ బస్టాప్ చేసి అన్ని బస్సులు ఆగే విధంగా కృషి చేస్తారని కోరారు . ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షుడు విజయరామరాజు,ప్రగడ దానయ్య, పావాడ వెంకటరమణమూర్తి, వై. భాస్కర్ రావు, ఆదినారాయణ, సన్యాసిరావు, జి. నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# అమాయక గిరిజనులను పనుల పేరుతో అక్రమంగా తరలిస్తే ఊరుకోం

- 18 మంది గిరిజన యువకులను పనులు పేరిట తరలింపు.
- గుత్తేదారుని దగ్గర హామీ పత్రం రాయించుకున్న నాయకులు.
- వైసిపి నాయకుడు అరబీరు జగబంధు, వైసిపి ముంచంగిపుట్టు మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు.
- అరకు పార్లమెంట్ టిడిపి ఆర్గనైజేషన్ మాజీ సెక్రెటరీ పాంగి శాస్త్రి బాబు, మండల టిడిపి మాజీ అధ్యక్షుడు బలరాం.




**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 30** అల్లూరి సీతారామరాజు జిల్లా, ముంచంగిపుట్టు మండలం, మారుమూల బుంగాపుట్టు పంచాయతీలోని పలు గ్రామాల యువకులు మరియు సరిహద్దు ఒడిస్సా ప్రాంతానికి చెందిన మరికొంత మంది యువకులను పనుల నిమిత్తం అనకాపల్లి తదితర ప్రాంతాల్లో తరలిస్తున్న సదరు గుత్తేదారుని పిలిచి వైసిపి అల్లూరి జిల్లా జెసిఎస్ కోఆర్డినేటర్ అరబీరు జగబంధు, అరకు పార్లమెంట్ ఆర్గనైజేషన్ మాజీ సెక్రెటరీ పాంగి శాస్త్రిబాబు, వైసిపి మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు, టిడిపి మండల మాజీ అధ్యక్షుడు కిల్లో బలరాం తదితర నాయకులు యువకులను తరలిస్తున్న గుత్తేదారునితో మాట్లాడి, దేని నిమిత్తం 18 మంది గిరిజన యువకులను తరలిస్తున్నారో వాటిపై ఆరా తీశారు. యువకులతో మాట్లాడి కుటుంబ సభ్యుల ఆమోదంతోనే వెళ్తున్నట్లు తెలపడంతో సదరు కాంట్రాక్ట్ తో మాట్లాడి హామీ పత్రాన్ని రాయించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అమాయక గిరిజనులను ఎవరైనా వివిధ కంపెనీలలో పనుల నిమిత్తం అక్రమంగా తరలిస్తే ఊరుకోమని, తరలిస్తున్న దళారుల వ్యవహారం తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన మరియు శిక్షార్హమైన నేరం ఉంటుందనేది సదరు వ్యక్తులు తెలుసు కోవాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలుఅరకొర ఉండటం, పేదరికం, మరియు అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని దళారులు గిరిజన యువతీ యువకులను తప్పుడు వాగ్దానాలతో నగరాల్లోని పరిశ్రమలకు, ఇటుక బట్టీలకు లేదా ఇతర ప్రమాదకరమైన పనులకు తరలిస్తున్నారు. బలవంతపు వెట్టిచాకిరీ పూర్తిగా నిషేధమని, గిరిజనులను వారి ఇష్టానికి వ్యతిరేకంగా శ్రమదోపిడీకి గురిచేయడం ఈ చట్టం కింద తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుందన్నారు. గిరిజనులకు ముందస్తుగా కొంత డబ్బు ఇచ్చి, ఆ తర్వాత ఎక్కువ జీతం ఇస్తామని నమ్మిస్తారని, కంపెనీలలో మంచి వసతులు, సమయానికి జీతాలు ఉంటాయని అబద్ధాలు చెబుతారనీ, తీరా వెళ్లాక కనీస సౌకర్యాలు లేకుండా గదుల్లో బంధించి పని చేయించుకుంటారని ఈ విషయంలో గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా పనులు చేయించుకున్న అనంతరం తగిన పారితోషికం ఇవ్వకుండా బాధితుల వద్ద ఉన్న మొబైల్ ఫోన్లను లాక్కొని, కుటుంబ సభ్యులతో మాట్లాడకుండా నిర్బంధిస్తారని, గతంలో అనేక సంఘటనలు జరిగాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గిరిజన సంఘాలు, మహిళా సంఘాలు, గ్రామస్తులు గ్రామాల్లోకి వచ్చే కొత్త వ్యక్తులు లేదా దళారుల కదలికలపై నిఘా ఉంచి, పోలీసు శాఖ వారికి గాని, నాయకులకు గాని, అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్, టిడిపి మండల ట్రెజరర్ జగదీష్, వైసిపి నేతలు తిరుపతి, అప్పారావు, రామరాజు,

## మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం




**ఆనందపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 30,** మానసిక ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జశ్వంత్ సూచించారు. ఆనందపురం మండలం బోని గ్రామంలో వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో, లైవ్ లవ్ లాఫ్ ఫౌండేషన్ సహకారంతో 'సంత్వనా' కార్యక్రమంలో భాగంగా మానసిక ఆరోగ్యంపై కమ్యూనిటీ అవగాహన, సున్నితీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జశ్వంత్ మాట్లాడుతూ.. శారీరక ఆరోగ్యంతో సమానంగా మానసిక ఆరోగ్య పరిరక్షణ కూడా ముఖ్యమన్నారు. మానసిక సమస్యలను తొలిదశలోనే గుర్తించి, అవసరమైన వైద్య సహాయం పొందాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ మాట్లాడుతూ.. మానసిక అనారోగ్యంపై సమాజంలో నెలకొన్న అపోహలు, వివక్ష కారణంగా బాధితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. మానసిక సమస్యల పట్ల సానుకూల దృక్పథాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నాగవంశం అధ్యక్షుడు సత్యవర ప్రసాద్ మాట్లాడుతూ.. మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అండగా నిలుస్తూ వాసవ్య మహిళా మండలి అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో మానసిక ఆరోగ్యంపై చైతన్యం పెంపొందుతుందని తెలిపారు.వాసవ్య మహిళా మండలి కార్యక్రమ సమన్వయకర్త హేమ మాట్లాడుతూ.. మానసిక ఆరోగ్య సమస్యల లక్షణాలు, చికిత్సా విధానాలు, బాధితులకు కుటుంబ సభ్యులు, సమాజం అందించాల్సిన సహకారంపై అవగాహన కల్పించారు. ప్రాజెక్ట్ అధికారి ఎం. నాగరాజు 'సంత్వనా' కార్యక్రమం ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. సమస్యలను గుర్తించడం, అవసరమైన వారికి వైద్య చికిత్స కోసం సూచించడం, కుటుంబ సభ్యులు, సంరక్షకులకు సహకారం అందించడం వంటి సేవలు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ వైద్యుడు నారాయణ, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్య అధికారులు, డ్వాక్రా వనరుల వ్యక్తులు తదితరులు కలిపి సుమారు 50 మంది పాల్గొన్నారు. సంత్వనా కమ్యూనిటీ యానిమేటర్లు పావని, రమణి కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన విలేకరి నాగూర్ నీ మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పరామర్శ




**జి.మాడుగుల. పెన్ పవర్.సెప్టెంబర్ (30)** ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జి.మాడుగులకు చెందిన ఓ పత్రికా విలేకరి నాగూర్ ను మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పరామర్శించారు. ప్రమాదంలో ఒక కాలుకి ఫ్రాక్చర్ కావడం బాధాకరమని తెలిపారు. ధైర్యంగా ఉండాలని, వైద్యుల సూచనలు పాటిస్తూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవల గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు విజయకుమారి, సన్యాసిదొర, మాజీ సర్పంచులు కొండబాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



**ఆనందపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 30,** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మాజీ మంత్రి, ప్రస్తుత భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవతో రౌతు అప్పలరాము, కోన ధనలక్ష్మికి సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మేరకు చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.ఆర్థిక ఇబ్బందులతో వైద్య ఖర్చులు భరించలేని కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అండగా నిలుస్తున్నామని కూటమి నాయకులు తెలిపారు. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సహాయ కార్యక్రమాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు టి అప్పారావు, మాజీ సర్పంచ్ బీఆర్బీ నాయుడు, భీమిలి నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు మద్ది శేఖర్, లోడగల వెంకట్రావు, నిమ్మల అప్పలరాజు, పాలవలస నారాయణరావు, రైతు రమణ తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుతంగా కాంట్రాక్టు ఆరోగ్య ఉద్యోగుల నిరసన



**జి.మాడుగుల. పెన్ పవర్.సెప్టెంబర్ (30)** మండలంలో కాంట్రాక్టు వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ) వద్ద ఉద్యోగులు భోజన విరమణ సమయంలో శాంతియుత నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విధి నిర్వహణలో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. జిల్లా కాంట్రాక్టు ఉద్యోగుల యూనియన్ ప్రధాన కార్యదర్శి సప్పి బాలయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కె. శంకర్‌రావు, వి. కొత్తందొర, ఎస్.కె. లాలు, పీబీటీఎస్. దేవి, కె. మణి, ఎస్. సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## 87వ వార్డులో ఘనంగా పందిరి రాట వేడుక




**కూర్మన్న పాలెం :పెన్ పవర్,సెప్టెంబర్ 30** దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 87వ వార్డులో కణితి గౌరీ యూత్ ఆధ్వర్యంలో పందిరి రాట వేయడం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 87వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.87వ వార్డు అధ్యక్షుడు బొడ్డ గోవింద్, గాజువాక బీసీ సెల్ అధ్యక్షుడు చిత్రాడ వెంకటరమణ, రాష్ట్ర ప్రచార కమిటీ సెక్రటరీ ప్రగడ శ్రీనివాసరావు, గాజువాక కళింగ సాధికార అధ్యక్షుడు బొడ్డ సన్యాసిరావు, సోషల్ మీడియా అధ్యక్షుడు పిన్నంటి సంతోష్ ,ప్రగడ అప్పలనాయుడు, కమిటీ సభ్యులు రవి, తేజ, శ్రీను, నాయుడు, నాగసూరి, హరి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు .

## దామనాపల్లిలో అక్టోబర్ 2న గ్రామసభ



**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 30**: దామనాపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో అక్టోబర్ 2న స్టాట్యుటరీ గ్రామసభ నిర్వహించనున్నట్లు పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ ఆర్. లక్ష్మి తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 11:30 గంటలకు స్పెషల్ ఆఫీసర్ అధ్యక్షతన గ్రామసభ జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామసభలో చర్చించనున్న నేపథ్యంలో పీసా ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కూటమి, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, యువత, ప్రజలు, సచివాలయ సిబ్బందితో పాటు వివిధ శాఖల అధికారులు, విబిజి రామ్ జి , వెలుగు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది తప్పనిసరిగా హాజరై గ్రామసభను విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## ప్రజల కోరిక మేరకు బరిలోకి డా. పావని - 16(13)వ వార్డులో జనసేన టికెట్ కు ప్రయత్నం

**వార్డు ప్రజల మద్దతు తనకుందన్న డాక్టర్ - అధిష్టానానికి తెలియజేసిన విద్యావంతురాలు**



**విశాఖ తూర్పు, పెన్ పవర్, సెప్టెంబర్ 30:** లిజీవీఎంసీ 16 (13) వ వార్డు ప్రజల అభీష్టం మేరకు జనసేన పార్టీ తరఫున కార్పొరేటర్ గా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు డా. కోవగపు పావని తెలిపారు. ప్రజల మద్దతు, వారి కోరిక మేరకే తాను టికెట్ కోసం ప్రయత్నిస్తున్నట్లు ఆమె పార్టీ అధిష్టానానికి తెలియజేశారు.వార్డులో పర్యటిస్తున్న తనకు ప్రజలు, కూటమి శ్రేణులు, జనసైనికులు, వీరమహిళల నుంచి విశేష మద్దతు లభిస్తోందని, విద్యావంతురాలిగా, సేవా దృక్పథం ఉన్న అభ్యర్థిగా తననే బరిలోకి దిగాలని వారు కోరుతున్నారని పేర్కొన్నారు. ప్రజల ఈ అభిమానాన్నే తాను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

తాను 10 ఏళ్లుగా పశువైద్యురాలిగా సేవ చేస్తున్నానని, గత ఎన్నికల్లో తండ్రి స్వర్గీయ కోవగపు సుధాకర్ రావు తో కలిసి వార్డులో తిరిగిన అనుభవంతో ప్రజల సమస్యలు తెలుసని, తల్లి కోవగపు సుశీల 1వ వార్డు కార్పొరేటర్ గా చేసిన అనుభవం తనకు స్ఫూర్తి అని అన్నారు.వార్డు ప్రజల మద్దతు తనకు ఉందని, పార్టీ టికెట్ ఇస్తే ప్రజాసేవకే అంకితమై పనిచేస్తానని ఆమె తెలిపారు.

## ప్రజాసేవే ప్రధాని మోదీ లక్ష్యం...!!

పరుశరామరాజు



**ఆనందపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 30,** ప్రజలకు సేవ చేయడమే ప్రధాని నరేంద్ర మోదీ ప్రధాన లక్ష్యమని జిల్లా బీజేపీ అధ్యక్షుడు పరశురాం రాజు అన్నారు. సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా అంగన్వాడీ సేవా మేళాకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఆనందపురం మండలం పెద్దిపాలెంలోని కింగ్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం అంగన్వాడీ, ఆశా కార్యకర్తల సత్కార కార్యక్రమం నిర్వహించారు. భీమిలి నియోజకవర్గానికి చెందిన సుమారు 200 మంది అంగన్వాడీ, ఆశా కార్యకర్తలను పరశురాం రాజు, బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు నాదెండ్ల జ్యోతి, జేరు కైలాష్‌రెడ్డి తదితరులు శాలువాలతో సత్కరించి, మోదీ జ్ఞాపికలను అందజేశారు.ఈ సందర్భంగా పరశురాం రాజు మాట్లాడుతూ సమాజానికి నిరంతరం సేవలందిస్తున్న వారిని గుర్తించి గౌరవించడం ద్వారా వారిలో మరింత సేవాభావం పెంపొందుతుందని అన్నారు. జీరు కైలాష్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ చేపట్టిన సేవా సంకల్ప్ అభియాన్ ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చన్నారు. ప్రతి పౌరుడు సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడం దేశాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో అంగన్వాడీ సీడీపీవో శ్రీదేవి, భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు,బీజేపీ కిసాన్ మోర్చా నాయకుడు కంచెర్ల శ్రీరామచంద్రమూర్తి, ప్రసాద్ పట్నాయక్, డిపి రాజు, కే.సునీత, కె.రామానాయుడు, పద్మనాభం పార్టీ అధ్యక్షురాలు తవటపు నాగమణి, ఆనందపురం పార్టీ నాయకురాలు పిల్ల విజయ, ఏలూరు ధర్మవతి, కె.సునీల్, పొట్నూరు కృష్ణారావు, డి.పి.రాజు దినేష్, నీలపు సురేష్, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత




టిడిపి తెలుగు యువత మండల అధ్యక్షుడు మజ్జి చిన్ని.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 30.** ముంచంగిపుట్టు మండలం, ఏనుగురాయి పంచాయతీ, చోటముఖిపుట్టు నుంచి పరతపుట్టు వరకు ఉన్న రహదారిని టీడీపీ మండల తెలుగు యువత అధ్యక్షులు మజ్జి చిన్ని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారి పరిస్థితి, ప్రజలు ఎదుర్కొంటున్న రాకపోకాల ఇబ్బందులపై చర్చించారు. ఈ సందర్భంగా మజ్జి చిన్ని మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, ఏనుగురాయి పంచాయతీలో ఇంకా పూర్తి కావాల్సిన రహదారి పనులను కూడా త్వరలో చేపట్టేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కాగా రహదారి అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు రాకపోకల సౌకర్యం మెరుగుపరచాలని స్థానికులు కోరారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి ఎం. ప్రమోద్, ఎం. మత్స్య పడాల్, సురేష్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు నైపుణ్య శిక్షణతో స్వయం ఉపాధికి బాట







**ములగాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 30 :**మహిళలు స్వయం ఉపాధి సాధించి ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు కోరమాండల్ ఇం టర్నేషనల్ లిమిటెడ్, విశాఖపట్నం ఆధ్వర్యం లో నిర్వహించిన మహిళల నైపుణ్యాభివృద్ధి ధ్రువపత్రాల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఉపాధ్యక్షురాలు శ్రీమతి రోషిని అపరంజి కోరాటి, ఐఏఎస్ హాజ రయ్యారు. వివిధ విభాగాల్లో శిక్షణ పూర్తి చేసు కున్న మహిళలకు ఆమె చేతుల మీదుగా శిక్షణ సామగ్రి, ధ్రువపత్రాలను అందజేశారు. కోరమాం డల్ సంస్థ ఆధ్వర్యంలో సుమారు 150 మంది మహిళలకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అం దించారు. ఇందులో జ్యూట్ సంచుల తయారీ, ఇంటి ఆహార పదార్థాల తయారీ, మగ్గం శిక్షణ, సౌందర్య సంరక్షణ శిక్షణ, వస్త్రాల రూపకల్పన తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు.ఈ శిక్షణ ద్వా రా మహిళలు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని స్వయం ఉపాధి అవకాశాలను పొం దేలా ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వా హకులు తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న మ హిళలకు అవసరమైన సామగ్రితో పాటు ధ్రువప త్రాలను అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కోరమాండల్ సంస్థ తయారీ విభాగం సీనియర్ సహాయ ఉపాధ్యక్షులు, విభా గాధిపతి ఆర్. షణ్ముగం, మానవ వనరుల విభా గం సహాయ ఉపాధ్యక్షులు కె.వి.వి.వై.ఎస్. నారాయణ, ఆర్థిక విభాగం అధిపతి జె. మహే ష్, పంపిణీ మరియు వాణిజ్య విభాగం అధిపతి కె. లక్ష్మీనారాయణ, సామాజిక బాధ్యత విభా గం నిర్వాహకులు వెంకటరమణతో పాటు సం స్థ సిబ్బంది పాల్గొన్నారు.మహిళలకు నైపుణ్యాలను అందించి, వారు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహ దపడతాయని నిర్వాహకులు తెలిపారు.

## జగన్నాథస్వామి మాస్టారుకు పదవి విరమణ ఘన సన్మానం

- విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అల్లూరి జిల్లా ఉపాధ్యక్షుడు జీ మోహన్ రావు, మండల అధ్యక్షుడు అంబిడి రామానుజులు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 30.**సమాజంలో ఎంతోమంది వ్యక్తులు ఉండవచ్చు కానీ ఒక భావితరాన్ని నిర్మించే శక్తి కేవలం ఉపాధ్యాయుడికి మాత్రమే ఉందని, కేవలం ఉద్యోగం నుండి మాత్రమే విరమణ పొందుతున్నారు కానీ విద్యార్థుల హృదయాల నుండి కాదు అని విశ్రాంత ఉపాధ్యాయ సంఘాల నేతలు గంపరాయి మోహన్ రావు, అంబిడి రామానూజులు అన్నారు. మండల కేంద్రంలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల1లో సోషల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తూ పదవి విరమణ చేసిన అంబిడి జగన్నాథ స్వామి మాస్టారుకు బుధవారం దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడు జగన్నాథం పాఠశాలలో కేవలం పాఠాలు మాత్రమే కాకుండా జీవిత పాఠాలను, విలువలను నేర్పించారనీ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన తీరుపై కొనియాడారు. ఒక శిల్పి రాయిని అందమైన శిల్పంగా మార్చినట్లు, ఉపాధ్యాయునిగా వేలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా, నాయకులుగా తీర్చిదిద్దారనీ తెలిపారు. ఆయన ఎల్లప్పుడూ ఒక మార్గదర్శిగా, నిబద్ధత, వృత్తి పట్ల గౌరవం ఎలా ఉండాలో అనేకమంది ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో సుదీర్ఘమైన, నిష్కళంకమైన ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నందుకు హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు. శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, ఆనందంగా, ప్రశాంతంగా గడపాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాము అన్నారు. ఈ కార్యక్రమములో విశ్రాంత ఉద్యోగుల మండల కార్యదర్శి మోదకొండ ఏ రాజయ్య వి నీలకంఠం ఏ సత్యం ఆర్ లక్ష్మణ్ ఏం రాజయ్య తది తరులు పాల్గొన్నారు.

## క్వాంటమ్ విద్యకు గీతంలో కొత్త వేదిక

న్యూఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్ర మంత్రి




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబరు 30 :** భారతదేశంలో క్వాంటమ్ సాంకేతికతలో సాంకే తిక విద్యను బలోపేతం చేసే దిశగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో క్వాంటమ్ బోధనా ప్రయో గశాలను ఏర్పాటు చేశారు. కేంద్ర శాస్త్ర సాంకే తిక పరిజ్ఞాన శాఖ డీఎస్‌టీ ఆధ్వర్యంలోని నేష నల్ క్వాంటమ్ మిషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ ప్రయోగశాలను కేంద్ర భూవిజ్ఞాన శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ బుధవారం న్యూఢిల్లీ నుంచి వర్చువల్ విధానంలో ప్రారం భించారు.నేషనల్ క్వాంటమ్ మిషన్‌లో భాగం గా 'ప్రగతి క్యూ ఫౌండ్రీ' కింద దేశవ్యాప్తంగా ఎం పిక చేసిన 23 ప్రముఖ విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన క్వాంటమ్ బోధనా ప్రయోగశాలలను కేంద్ర మంత్రి ఏకకాలంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటింగ్, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ ఎస్. అరుణ్ కుమార్ పాల్గొన్నారు.ఇంజనీరింగ్ అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులకు క్వాంటమ్ సాంకేతికతపై ప్రత్యక్ష అనుభవం, పరిశోధనా నైపుణ్యాలు, ప్రాక్టికల్ అవగాహన కల్పించడమే ప్రయోగశాల ప్రధాన ఉద్దేశమని గీతం క్వాంటమ్ బోధనా ప్రయోగశాల ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ శ్రీనివాస్ ఎల్. చక్రవర్తి తెలిపారు. అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో క్వాంటమ్ టెక్నాలజీస్ మైనర్ కోర్సు నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఈ ప్రయోగశాల అందిస్తుంద ని ఆయన పేర్కొన్నారు. ఆధునిక ల్యాబొరేటరీ పరికరాలు, భౌతిక మౌలిక వసతుల ద్వారా సూ పర్‌కండక్టింగ్ క్యూబిట్లు, సెమీకండక్టింగ్ క్యూ బిట్లు, న్యూట్రల్ అటామ్, అయాన్ ట్రాప్, ఫోటో నిక్స్, క్వాంటమ్ సెన్సింగ్, క్వాంటమ్ కమ్యూని కేషన్, క్వాంటమ్ అల్గారిథమ్స్ వంటి కీలక రంగాల్లో విద్యార్థులకు ప్రాథమిక పరిజ్ఞానం, నైపుణ్యాలను అందించనున్నట్లు వివరించారు.

అండర్‌గ్రాడ్యుయేట్ విద్యకే పరిమితం కాకుండా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, ప్రత్యేక శిక్షణ, విద్యార్థుల ప్రాజెక్టులు, పరిశ్రమ--విద్యా సంస్థల భాగస్వామ్యాలకు కూడా ఈ ప్రయోగశా ల వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు.

గీతంలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్ర మంలో ప్రొఫెసర్ జి.వి.ఎస్. రాజ్‌కుమార్, డాక్టర్ కె. నవీన్‌కుమార్‌తో పాటు పలువురు విద్యావే త్తలు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. నూతన క్వాంటమ్ బోధనా ప్రయోగశాల ఏర్పా టు ద్వారా క్వాంటమ్ సాంకేతికత రంగంలో గీతం విద్యార్థులకు ఆధునిక శిక్షణ, పరిశోధనా అవకాశాలు మరింత అందుబాటులోకి వస్తాయ ని విశ్వవిద్యాలయ ప్రతినిధులు తెలిపారు.ం

## స్టీల్ సిటీ గాజువాక పి ఎస్ ను తనిఖీ చేసిన డీసీపీ మేరీ ప్రశాంతి



**గాజువాక :పెన్ పవర్, సెప్టెంబర్ 30** పారిశ్రామిక ప్రాంతం గాజువాక పోలీస్ స్టేషన్‌ను మేరీ ప్రశాంతి ఐపీఎస్ , డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, జోన్--2 లా అండ్ ఆర్డర్, జాయింట్ పోలీస్ కమిషనర్, విశాఖపట్నం తనిఖీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, క్రైమ్ రిజిస్టర్లు, కేసులకు సంబంధించిన వివరాలు, పెండింగ్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతి తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తులో నాణ్యత పాటిస్తూ, ప్రతి కేసులో అందుబాటులో ఉన్న ఆధారాలను సమర్థవంతంగా సేకరించి, దర్యాప్తును నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను సానుకూలంగా విని, చట్టపరమైన నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు, శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో పోలీస్ సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని డీసీపీ సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న అంశాలపై ముందస్తు చర్యలు చేపట్టాలని,ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అవసరమైన ముందస్తు బందోబస్తు, నిఘా మరియు భద్రతా చర్యలను పటిష్టంగా చేపట్టాలని సూచించారు.

ప్రజలు ఎటువంటి భయాందోళనలు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ప్రశాంత వాతావరణం కల్పించేందుకు పోలీస్ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల విధులకు సంబంధించి సిబ్బందికి ముందస్తు అవగాహన కల్పించి, వారికి కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారుఇన్‌స్పెక్షన్‌లో భాగంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలు, కార్యాలయ గదులు, రికార్డుల నిర్వహణ విధానం మరియు పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచాలని, రికార్డులను సక్రమంగా భద్రపరచాలని సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడి, వారి విధుల నిర్వహణ, ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలు మరియు సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, నేరాల నియంత్రణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా పనిచేయాలని డీసీపీ సూచించారు.

# వైసీపీ అభ్యర్థులు గెలుపే లక్ష్యం



పెదగూడ పంచాయతీలో మరోసారి వైసీపీ జెండా ఎగరాలి.

వైసీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు, పంచాయతీ అధ్యక్షుడు కూడా దాసు బాబు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, సెప్టెంబరు 30.**మండలంలోని పెదగూడ పంచాయతీలో వైసీపీ విస్తృత స్థాయి సమావేశం పంచాయతీ అధ్యక్షులు కూడా దాసుబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సమావేశానికి మండల వైసీపీ అధ్యక్షులు పాంగి పద్మారావు పాల్గొని మాట్లాడుతూ..రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచే అభ్యర్థికే ప్రోత్సహిస్తూ పెదగూడ పంచాయతీలో వైసీపీ జెండా ఎగిరేల చూసుకోవాలని పలు సూచనలు చేశారు. అనంతరం అల్లూరి జిల్లా కోఆర్డినేటర్ జగబుందు మాట్లాడుతూ.. ఇప్పటిదాకా కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి మూడేళ్ల కావస్తున్న ప్రజలకు ఏ మేలు చేసింది లేదని, అలాగే గతవైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు అమలు చేసినటువంటి పథకాలు కూటమి ప్రభుత్వం కాపీ కొడుతుంది అన్నారు. రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికలో కూటమి చేస్తున్నటువంటి అరాచకాలను ప్రతి గడపకు తీసుకువెళ్తే మళ్లీ కచ్చితంగా వచ్చేది మన వైసీపీ ప్రభుత్వమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాబురావు, మాజీ ఎంపీటీసీ గణపతి, మండల వైసిపి కార్యదర్శిలు నాయకులు చెండా పాపారావు, ముఖి రాంప్రసాద్, సీనియర్ నాయకులు రామూర్తి, జయదేవ్, లక్ష్మణ్, రామకృష్ణ, శంకర్, సురేష్, లక్ష్మణ్, తిరుపతి, రామరాజు వివిధ గ్రామాల అభిమానులు పాల్గొన్నారు.

## వినాయక మండపాల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ సందడి

అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డింపు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, సెప్టెంబర్ 30** :వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా దక్షిణ ని యోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ గారు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఏ ర్పాటు చేసిన వినాయక మండపాలను సంద ర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 37వ వార్డు పరిధిలోని జబ్బర్ తోట, 35వ వార్డు పరిధిలోని వెలంపేట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా స్వా మివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నియో జకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయు రారోగ్యాలతో ఉండాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించారు.అనంతరం ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వ డ్డించారు. భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్స వాలను నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యుల ను అభినందించారు.వినాయక చవితి ఉత్సవా లు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సేవాభా వం, సామాజిక స్ఫూర్తిని పెంపొందించేలా నిర్వ హించడం అభినందనీయమని ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఉత్సవాలను ప్రశాం త వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించా లని నిర్వాహకులకు సూచించారు.

ఈ కార్యక్రమాల్లో కూటమి నేతలు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.

## రింతాడ ఆశ్రమ బాలికల పాఠశాల కమిటీ చైర్మన్‌గా కాకూరి వెంకటరమణ

రింతాడ ఆశ్రమ బాలికల పాఠశాల నిర్వహణ కమిటీకి నూతన నాయకత్వం




**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, సెప్టెంబర్ 30**: రింతాడ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికల్లో చైర్మన్‌గా కాకూరి వెంకట రమణ, ఉపాధ్యక్షురాలిగా చిలకల భాగ్యలక్ష్మి ఎన్నికయ్యారు. పాఠశాలలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో నూతన కమిటీని ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన చైర్మన్, ఉపాధ్యక్షురాలికి పలువురు అభినందనలు తెలిపారు. ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న గిరిజన బాలికలకు మెరుగైన విద్య, వసతి, మౌలిక సదుపాయాలు అందేలా కమిటీ ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థినుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, పాఠశాల అభివృద్ధికి అవసరమైన చర్యలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు.ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యంతో సమన్వయం చేసుకుంటూ విద్యార్థినుల విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల మరింత అభివృద్ధి సాధించి, గిరిజన బాలికలకు మెరుగైన విద్యా వాతావరణం అందుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు సుమిత్ర ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

# గాజువాక డిపో పనులు వేగవంతం చేయాలి

**అక్టోబర్ 15లోగా 30 గ్రీన్ మెట్రో ఏసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు**

**సింహపురి డిపోకు నెలాఖరులోగా 50 బస్సులు**

**ఏరో ఎక్స్‌ప్రెస్‌కు ప్రయాణికుల ఆదరణ పెరగాలి: ఆర్ఎం బి. అప్పల నాయుడు**

**ములగాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 30 :**గాజువాక ఎలక్ట్రికల్ డిపోలో జరుగుతున్న సివిల్, ఎలక్ట్రికల్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఏపీఎస్ఆర్టీసీ విశాఖపట్నం రీజనల్ మేనేజర్ బి. అప్పల నాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన గాజువాక ఎలక్ట్రికల్ డిపోను తనిఖీ చేసి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు.అక్టోబర్ నెలలో గాజువాక డిపోకు కేటాయించిన 30 గ్రీన్ మెట్రో ఏసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు అక్టోబర్ 15వ తేదీలోగా చేరుకోనున్నట్లు ఆర్ఎం తెలిపారు. అలాగే సింహపురి ఎలక్ట్రికల్ డిపోకు కేటాయించిన 50 గ్రీన్ మెట్రో ఏసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు అక్టోబర్ నెలాఖరులోగా చేరుకునే అవకాశం ఉందన్నా రు. బస్సులు చేరుకునేలోగా రెండు డిపోలలో మిగిలిన సివిల్, ఎలక్ట్రికల్ పనులను అత్యంత వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారు లు, సూపర్‌వైజర్లకు సూచించారు.ప్రధానమంత్రి ఈ-బస్ సేవా పథకం కింద విశాఖపట్నానికి ఎల క్ట్రిక్ బస్సులు అందుతున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వీటిని త్వరితగ తిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావ డానికి చర్యలు చేపడుతున్నామని బి. అప్పల నాయుడు తెలిపారు.

**ఏరో ఎక్స్‌ప్రెస్‌కు ఆదరణ పెరగాలి**

ఓల్డ్ గాజువాక నుంచి ఏఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ వరకు నడుస్తున్న ఏరో ఎక్స్‌ప్రెస్ ఏ. ఎస్.ఆర్-1, ఏ. ఎస్.ఆర్--2 సర్వీసులు సక్రమం గా నడుస్తున్నాయని ఆర్ఎం తెలిపారు.ఏ. ఎస్. ఆర్--1 సర్వీస్ హైవే మార్గంలో, ఏ.ఎస్.ఆర్--2 సర్వీస్ బీచ్ రోడ్ మార్గంలో నడుస్తున్నట్లు వివ రించారు. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులు, ఎయిర్ పోర్ట్ ఉద్యోగులు, విశాఖపట్నం నుంచి విమాన ప్రయాణం చేసేవారు ఏరో ఎక్స్‌ప్రెస్ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. ప్రస్తు తం ఈ సర్వీసులకు సుమారు 30 శాతం ఆక్యు పెన్సీ మాత్రమే ఉందని, ప్రయాణికుల వినియో గం పెరిగితే ఈ సేవలు మరింత ప్రయోజనకరం గా మారతాయని తెలిపారు. ట్రాఫిక్ రద్దీ కారణంగా అప్పుడప్పుడు సుమారు 15 నిమిషాల వరకు ఆలస్యం ఏర్పడుతున్నప్ప టికీ, ఏరో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు సుమారు 95 శాతం సమయపాలనతో నడుస్తున్నాయని ఆర్ఎం చెప్పారు. ముఖ్యమైన బస్‌స్టాప్‌లలో సర్వీసుల టైమింగ్స్ ఏర్పాటు చేస్తున్నామని, బస్సుల లొకేషన్‌ను గూగుల్ మ్యాప్స్‌తో పాటు ఏపీఎస్ఆర్టీసీ మొబైల్ యాప్‌లో కూడా తెలు సుకునే సౌకర్యం ఉందన్నారు.వివిధ బస్‌స్టాప్‌ల వద్ద ప్రయాణికులు చేయి చూపిన వెంటనే ఏరో ఎక్స్‌ప్రెస్ బస్సులను నిలిపేలా సిబ్బందికి సూచ నలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రయాణికులు ఏరో ఎక్స్‌ప్రెస్ సేవలను విస్తృతంగా వినియోగించుకు ని విమానాశ్రయానికి సౌకర్యవంతంగా, తక్కువ వ్యయంతో ప్రయాణించుకోవాలని బి. అప్పల నాయుడు కోరారు.

గాజువాక డిపో తనిఖీలో డిపో మేనేజర్, సూప ర్‌వైజర్ నాగభూషణ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సివిల్ నారాయణ, డిపో నిర్మాణ పను ల కాంట్రాక్టర్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com